
Follow: @ANNTELUGU
29-05-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 150 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## రాయదుర్గంలో ఎకరా భూమి ధర రూ.237 కోట్లు

**హైదరాబాద్ వెస్ట్ తగ్గేదెలే.. ఏడాదిలో రూ.60కోట్లు పెరుగుదల**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహించిన భూముల వేలానికి మార్కెట్లో ఊహించని రీతిలో భారీ స్పందన లభించింది. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు సరికొత్త రికార్డులను సృష్టిస్తూ ఆకాశాన్ని తాకాయి. నగరంలో అత్యంత డిమాండ్ ఉన్న రాయదుర్గం పరిధిలోని సర్వే నంబర్ 83/1లో గల 6 ఎకరాల 9 గుంటల భూమిని టీజీఐఐసీ తాజాగా వేలానికి ఉంచగా.. ఐటీ, రియల్టీ దిగ్గజాలు ఈ స్థలాన్ని దక్కించుకునేందుకు తీవ్రంగా పోటీ పడ్డాయి. ఈ హోరాహోరీ వేలంలో ఎన్నడూ లేని విధంగా ఒకే ఒక్క ఎకరం భూమి ధర ఏకంగా రూ.237 కోట్ల మార్కును తాకి రియల్ ఎస్టేట్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. దేశంలోనే అత్యంత ఖరీదైన వాణిజ్య భూముల సరసన హైదరాబాద్ ఐటీ కారిడార్ నిలిచిందని ఈ వేలం ప్రక్రియ మరోసారి నిరూపించింది. గతేడాది సైతం ఇదే రాయదుర్గం ప్రాంతంలో జరిగిన భూముల వేలంలో ఎకరం

మిగితా 2వ పేజీలో

**టాప్ న్యూస్**



## హర్మ్యూజ్‌లో అమెరికా దాడులు

- ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్మధ్యంతర ఎన్నికలున్నా తగ్గం
- శాంతి చర్చలు విఫలమైతే వెనక్కి తగ్గమన్న ట్రంప్
- అణ్వాయుధాలపై ఇరాన్‌కు అమెరికా హెచ్చరికలు

02



## చేతనైతే చేసి చూపించు

- 20లక్షల ఇండ్ల గృహప్రవేశాలు అయ్యాకే పొంగులేటి ప్రజలను ఓట్లు అడగాలి
- మంత్రికి కేటీఆర్ సవాల్
- శపథాలు కాదు.. చేసి చూపించాలన్న కేటీఆర్

02




## విజయసాయి విచారణ

- ఏడున్నర గంటల పాటుఈడీ సుదీర్ఘ విచారణ
- లిక్కర్ కేసుతో తనకు సంబంధం లేదన్న విజయసాయి
- విచారణకు పూర్తి సహకారం అందించానన్న ఎంపీ

02

# కర్నాటక సీఎంగా డీకే శివకుమార్



## కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం

స్వయంగా ప్రకటించిన సిద్ధరామయ్య
రాజీనామా లేఖ లోక్ భవన్ లో అందజేత
కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్న డీకే
రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానన్న సిద్ధూ



**బెంగళూరు, మహా :** కర్నాటకలో అధికార మార్పిడి ప్రచారానికి తెరపడింది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి లోక్‌భవన్‌కు వెళ్లిన సిద్ధరామయ్య తన రాజీనామాను సమర్పించారు. ప్రస్తుతం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ బెంగళూరులో లేనందున గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ప్రభు శంకర్ రాజీనామా పత్రాన్ని స్వీకరించారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం తన స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌కు గవర్నర్ వెళ్లారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత సిద్ధరామయ్య రాజీనామాపై నిర్ణయం తీసుకుంటారు. తర్వాత మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సిద్ధరామయ్య కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు తాను

మిగితా 2వ పేజీలో



## తెలుగుజాతికి స్ఫూర్తి నింపిన ఎన్టీఆర్

### అంబేద్కర్, ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ దేశ రత్నాలు

**ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**మాట నిలబెట్టుకున్న సీఎం**

ఎన్టీఆర్ తెలుగు ఆత్మగౌరవానికి ప్రతీక అన్న సీఎం
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల హామీని నిలబెట్టుకున్న రేవంత్
మైత్రీవనం చౌరస్తాలో భారీగా తరలివచ్చిన అభిమానులు

**నగర నడిబొడ్డున ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు పట్ల హర్షం**

02



## పటిష్టవంతంగా నీట్ రీటెస్ట్

- పీఎంవో పర్యవేక్షణలో పరీక్ష నిర్వహణ
- జూన్ 21 నిర్వహించే పరీక్షకు పడక్బంధీ ఏర్పాట్లు
- రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ నివాసంలో జరిగిన సమావేశంలో కీలక నిర్ణయం

02



## పౌరుల సంక్షేమంపై యూనిఫైడ్ కార్డ్

- సీఎం రేవంత్ సూచన

02

## బెంగాల్‌లో చొరబాట్లకు చెక్

- స్వచ్ఛందంగా వెళ్లకపోతే బలవంతంగానైనా పంపిస్తాం.
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు.

07

## ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆ పదవి నుంచి తొలగించాల్సిందే

- రాహుల్ గాంధీ ధ్వజం.

03

## త్వరలో కాజీపేటలో ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభం

- రానున్న ఐదేళ్లలో 200 రైళ్ల ఉత్పత్తేలక్ష్యం.
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్



## తెలంగాణలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కారే

- రైతుల పక్షాన నిలబడేది బీజేపీనే
- ధాన్యం చివరి గింజా కొనేవరకు వదిలి పెట్టం
- యువత, మహిళలు బీజేపీ వైపు చూస్తున్నారు
- శిక్షణా తరగతుల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా



02

## ఒమన్‌ను పేల్చేస్తాం!

- మిత్రదేశంపై ట్రంప్ సంచలన హెచ్చరిక.
- అంతర్జాతీయ జలమార్గం హోర్ముజ్ పై ఆధిపత్యం చెలాయిస్తే సహించేది లేదు.
- ఇరాన్ సైనిక స్థావరాలపై మరోసారి అమెరికా వైమానిక దాడులు.

07

## అకాల వర్షాలనూ మీ రాజకీయాల కోసం వాడుకోవద్దు

- బీజేపీది రైతు గోస కాదు.. అధికారం కోసం రాజకీయ ఘోష
- ప్రజల్ని తప్పదోవ పట్టించేలా బీఆర్ఎస్ డైవర్షన్ పాలి'ట్రిక్స్'
- ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలది దుష్ప్రచారం
- మంత్రి శ్రీధర్ బాబు ఫైర్

02





## త్వరలో కాజీపేటలో ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభం.

- రానున్న ఐదేళ్లలో 200 రైళ్ల ఉత్పత్తేలక్ష్యం.
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్.

ఢిల్లీ, మహా : తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక రంగానికి మరింత ఊపునిచ్చేలా వరంగల్ జిల్లా కాజీపేటలో అత్యాధునిక రైల్వే తయారీ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ ప్రతిష్టాత్మక ఫ్యాక్టరీలో త్వరలోనే ఇంటర్ సిటీ రైళ్ల తయారీ పనులు అధికారికంగా ప్రారంభం కాబోతున్నాయని ఆయన ప్రకటించారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్ పురోగతి, భవిష్యత్తు కార్యాచరణపై ఢిల్లీలో ఉన్నతాధికారులతో నిర్వహించిన కీలక సమీక్షా సమావేశంలో మంత్రి ఈ సంచలన వివరాలను పంచుకున్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో ఈ ప్రతిష్టాత్మక యూనిట్ ద్వారా ఏకంగా 200 అత్యాధునిక ఇంటర్ సిటీ రైళ్లను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయాలని స్పష్టమైన లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

కాజీపేట ఫ్యాక్టరీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించే ఈ అధునాతన ఇంటర్ సిటీ రైళ్లను దేశవ్యాప్తంగా వివిధ ప్రధాన నగరాల మధ్య స్వల్ప దూర ప్రయాణాల కోసం ప్రత్యేకంగా వినియోగించనున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు. ప్రయాణికుల సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణమే ధ్యేయంగా ఈ రైళ్ల రూపకల్పన జరుగుతోందన్నారు. కొత్తగా అందుబాటులోకి రానున్న ఈ ఇంటర్ సిటీ రైళ్లు వందే భారత్ తరహాలోనే ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్ (స్వయంచాలక తలుపులు), అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మెరుగైన వెంటిలేషన్ సిస్టమ్‌తో ముస్తాబు కానున్నాయని తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇక్కడి వేదికపై తయారయ్యే ప్రతి రైలులోనూ సుమారు 20 కోచ్‌లు (భోగీలు) ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు.సాంకేతికపరంగాను ఈ రైళ్లు సరికొత్త రికార్డులను సృష్టించబోతున్నాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. పట్టాలపై గంటకు 130 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించేలా ఈ సరికొత్త రైళ్లను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ రైళ్లలో అత్యంత ఆధునికమైన 'రీజనరేటివ్ బ్రేకింగ్ సిస్టమ్' పరిజ్ఞానాన్ని అమరుస్తున్నట్లు వెల్లడించారు. ఈ అద్భుత సాంకేతికత ద్వారా రైలుకు బ్రేకులు వేసిన ప్రతిసారీ ఉత్పత్తి అయ్యే గతిశీల విద్యుత్ శక్తి వృథా కాకుండా, దాన్ని తిరిగి విద్యుత్ గ్రిడ్‌లోకి పంపే వీలుంటుందని వివరించారు. కాజీపేటలో ఈ రైల్వే ఉత్పాదక రంగం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, దేశీయ రైల్వే మౌలిక వసతుల రంగంలో తెలంగాణ ఒక ప్రధాన హబ్‌గా అవతరించనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్

( మొదటి పేజీ తరువాయి )

రాజీనామా చేసినట్లు ప్రకటించారు. గవర్నర్ బెంగళూరు తిరిగి వచ్చిన తర్వాత రాజీనామాపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.

పొరపాటున రాజకీయాల్లోకి వచ్చాను: సిద్ధరామయ్య

రాజీనామా సమర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ సిద్ధరామయ్య భావోద్వేగానికి గురయ్యారు. తాను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చానని సిద్ధరామయ్య చెప్పారు. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదన్నారు. తన కుటుంబంలో ఎవరూ రాజకీయాల్లో లేరని ఆయన వివరించారు. సామాజిక న్యాయం, సమానత్వాన్ని నమ్ముతానని తెలిపారు. సమాజంలో అసమానతలు తొలగాలని కోరుకుంటానని వెల్లడించారు. అందరికీ సమాన అవకాశాలు దక్కాలన్నారు. తాను రాజ్యాంగాన్ని గౌరవిస్తానని చెప్పారు. "రాజీనామా లేఖ సమర్పించాను. గవర్నర్ ప్రస్తుతం బెంగళూరులో లేరు. గవర్నర్ లేకపోవడంతో లేఖను కార్యదర్శికి ఇచ్చాను. అధిష్ఠానం సూచనలతో రాజీనామా చేశాను. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. నా రాజీనామాను గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. రాజ్యాంగబద్ధంగా గవర్నర్ నా రాజీనామా ఆమోదిస్తారు. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు ధన్యవాదాలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవలందించే అవకాశం వచ్చింది. రాజ్యాంగమే మా ధర్మం ప్రజలే మా దేవుళ్లు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చాను. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. నా కుటుంబంలో ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్ పార్టీలో చేరాను. పార్టీలో చేరినప్పటి నుంచి కాంగ్రెస్ నన్ను ఆదరించింది. సీఎంగా, ఎల్‌వోపీగా రెండుసార్లు సేవలందించాను. ఏడు కోట్ల



కన్నడ ప్రజలకు సేవలందించాను. నేను రాజ్యాంగాన్ని గౌరవిస్తాను. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చే యత్నం చేశాను. మేనిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చాను. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారంటీలు నెరవేర్చాను. శాసనసభలో మాకు పూర్తి మెజారిటీ ఉంది. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. తలసరి ఆదాయంలో కర్ణాటక అగ్రస్థానంలో ఉంది. జీఎస్టీ వసూళ్లలో కర్ణాటక రెండో స్థానంలో ఉంది." అని సిద్ధరామయ్య అన్నారు.

సీఎం పదవి చేపట్టనున్న డీకే శివకుమార్

అంతకుముందు ఈ ఉదయం బెంగళూరులోని తన అధికారిక నివాసంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు సిద్ధరామయ్య అల్పాహార విందు ఇచ్చారు. ఈ సందర్భంగా తన రాజీనామా విషయాన్ని మంత్రులకు తెలియజేసిన సిద్ధరామయ్య తదుపరి సీఎం డీకే శివకుమార్ అని ప్రకటించారు. సిద్ధరామయ్యకు డీకే శివకుమార్ పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. తర్వాత వారిద్దరూ ఆలింగనం చేసుకున్నారు.

మద్ధతు దారుల ఆందోళన

ఇదిలా ఉండగా సిద్ధరామయ్య రాజీనామా నిర్ణయానికి వ్యతిరేకంగా ఆయన మద్దతుదారులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. శివమొగ్గలోని శివప్ప నాయక సర్కిల్ వద్ద ఆయన మద్దతుదారులు ధర్నాకు దిగారు. కురుబ సామాజికవర్గానికి చెందిన నేతలు ఈ నిరసనకు నాయకత్వం వహించారు. రెండు పొట్టేళ్లను కూడా ఘటనా స్థలానికి తీసుకువచ్చారు. సిద్ధరామయ్య నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ రోడ్డుపై టైర్లను తగులబెట్టారు. సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అన్న రామయ్య అహిందా నేత సిద్ధరామయ్య అంటూ ఆయనకు మద్దతుగా నినాదాలు చేశారు. ముఖ్యమంత్రిగా కొనసాగాలని డిమాండ్ చేశారు. యాద్గిర్‌లో సిద్ధరామయ్య వీరాభిమాని రాజ్‌కుమార్ గణీర్ అనే వ్యక్తి సుభాష్ చంద్ర సర్కిల్ వద్ద మౌనప్రదర్శనకు దిగారు. ఆయన రాజీనామా నిర్ణయంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# తెలుగుజాతికి స్ఫూర్తి నింపిన ఎన్టీఆర్

**హైదరాబాద్, మహా :** తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పి, ప్రజల్లో ఒక కొత్త రాజకీయ, సామాజిక చైతన్యాన్ని నింపిన మహానాయకుడు నందమూరి తారకరామారావు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. నటసార్వభౌముడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు భారీ కాంస్య విగ్రహం హైదరాబాద్ అమీర్‌పేటలోని మైత్రీవనం చౌరస్తాలో కొలువుదీరింది. నూతనంగా ఏర్పాటుచేసిన 23 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఘనంగా ఆవిష్కరించారు.దేశం గర్వించదగ్గ గొప్ప నాయకులలో ఎన్టీఆర్ ఒకరు అని అన్నారు. భారతదేశ చరిత్రను, ఇక్కడి ప్రజాస్వామ్య వ్యవస్థను మలుపు తిప్పిన ముగ్గురు గొప్ప నాయకులను దేశం ఎల్లప్పుడూ స్మరించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ఇందిరా గాంధీ, ఎన్టీఆర్‌లను భారతదేశ జాతిరత్నాలుగా అభివర్ణించిన ఆయన, ఈ ముగ్గురు నాయకులు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు దేశాన్ని ప్రగతిపథంలో నడిపించాయని పేర్కొన్నారు. సమాజంలో ఎంతటి అట్టడుగున ఉన్న సామాన్యుడికైనా పాలకుడిని మార్చే శక్తినిస్తూ ఓటుహక్కు కల్పించిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను మనం ప్రతిక్షణం గుర్తుంచుకోవాలన్నారు. అలాగే పురుషులతో సమానంగా మహిళలకు కూడా ఓటుహక్కు కల్పించి, వారిని రాజకీయంగా, సామాజికంగా సమాన భాగస్వాములను చేసిన ఘనత మన నాయకులకే దక్కుతుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అజారుద్దీన్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


**మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి**

నటసార్వభౌముడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావుభారీ కాంస్య విగ్రహం హైదరాబాద్ అమీర్‌పేటలోని మైత్రీవనం చౌరస్తాలో కొలువుదీరింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా.. మైత్రీవనం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.. నగరంలోని ఎన్టీఆర్ అభిమానుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ, ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి ఈ విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి మరీ ఆవిష్కరించారు. నగర నడిబొడ్డున ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించడం పట్ల నందమూరి అభిమానులు, తెలుగు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, భారీ సంఖ్యలో ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## రాయదుర్గంలో ఎకరా భూమి ధర
# రూ.237 కోట్లు

( మొదటి పేజీ తరవాయి )

ధర గరిష్టంగా రూ.177 కోట్లు పలికి అప్పట్లో సంచలనం సృష్టించింది. అయితే, ప్రస్తుత వేలంలో ఆ పాత రికార్డులన్నీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. గత రికార్డుతో పోలిస్తే ఈసారి ఎకరాకు అదనంగా మరో రూ.60 కోట్లు అధికంగా పలకడం గమనార్హం. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ ఐటీ రంగానికి ఉన్న క్రేజ్, మౌలిక సదుపాయాల విస్తరణ, భవిష్యత్తులో ఈ ప్రాంతంలో రాబోయే భారీ కమర్షియల్, ప్రాజెక్టుల అంచనాలే ఈ స్థాయి పోటీకి కారణమని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ భారీ వేలం ద్వారా ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగించిందంటూ వస్తున్న ఊహాగానాలకు ఈ వేలం ఫలితాలు గట్టి సమాధానం చెప్పాయని రియల్టర్లు వ్యాఖ్యానిస్తున్నారు. గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలో భూములకు ఉన్న డిమాండ్ ఏ మాత్రం తగ్గలేదని, రాబోయే



రోజుల్లో ప్రీమియం లొకేషన్లలో ధరలు మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయమని ఈ ఊహించని స్పందన స్పష్టం చేస్తోంది.

## తెలంగాణలో రాబోయేది
# డబుల్ ఇంజన్ సర్కారే

మొయినాబాద్, మహా : రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజెపి అధికారంలోకి రావడం ఖాయమని, ఇక్కడ కూడా "డబుల్ ఇంజన్ సర్కార్" ఏర్పాటు కోసం రంగారెడ్డి జిల్లా నుంచే మొదలవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. కార్యకర్తలంతా విభేదాలు పక్కనపెట్టి, సమన్వయంతో ఒక బృహత్తర లక్ష్యంతో కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ లో నిర్వహించిన పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ్ మహా అభియాన్ తరగతుల్లో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మారుతున్న కాలంతో పాటు పార్టీ సిద్ధాంతాలు, విధానాలపై కార్యకర్తలకు పూర్తి అవగాహన కల్పించడానికే ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీల మెంటాలిటీ ఒకటేనని, యువతను రెచ్చగొట్టి రైల్వే స్టేషన్లు, ఆఫీసులు తగలబెట్టించే విచ్ఛిన్నకర శక్తులకు ఇరు పార్టీల నేతలు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను, విద్యార్థులను మోసం చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉద్యోగాలు ఇవ్వకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులు, యువత భవిష్యత్తుతో ఆడుకుంటోందని విమర్శించారు. రైతులకు ఇస్తామన్న రూ. 15 వేల రైతు భరోసా ఇప్పటివరకు సరిగ్గా ఇవ్వలేదని, ఒకటో తేదీన జీతాలు ఇస్తామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఉద్యోగులకు, రిటైర్డ్ సిబ్బందికి పెన్షన్లు, బెనిఫిట్స్ ఇవ్వలేని చేతగాని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు అనేక చోట్ల కొనుగోలు కేంద్రాల్లోని రైతుల ధాన్యం, మక్కలు, జొన్నలు తడిసి ముద్దయ్యాయని, కొనే నాథుడు లేక రైతులు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "చివరి గింజ వరకు కొంటామని" చెప్పి, మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, తన చేతగానితనాన్ని కేంద్రం మీదకు నెడుతోందని విమర్శించారు. రైతుల హక్కుల కోసం బిజెపి చేపట్టిన 'రైతు గోస బిజెపి భరోసా' యాత్ర నిర్మల్ (సారంగపూర్) తో ముగిసినా.. రైతులకు న్యాయం జరిగే వరకు బిజెపి పోరాటం ఆగదని హెచ్చరించారు. బిజెపి నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి, హౌస్ అరెస్టులతో భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశంలో అవినీతి రహిత, ప్రజా సంక్షేమ పాలన అందిస్తూ సరికొత్త రికార్డు సృష్టించారని రాంచందర్ రావు కొనియాడారు. ప్రపంచం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారతదేశం ఆర్థికంగా దూసుకుపోతూ త్వరలోనే మూడో స్థానానికి చేరబోతుందని, మోదీ దార్శనికతతో 'వికసిత్ భారత్' సాధించి ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణకు కేంద్రం గత 12 ఏళ్లలో సుమారు రూ. 13 లక్షల కోట్లు కేటాయించిందని.. ప్రతినెలా 5 కిలోల ఉచిత బియ్యం, జాతీయ రహదారులు, ములుగులో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, బీబీనగర్ ఎయిమ్స్, వరంగల్ ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణ, జన్ ధన్ ఖాతాలు ఇవన్నీ మోదీ వల్లే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు.

కార్యకర్తల శ్రమ, త్యాగాలు, ఎందరో సీనియర్ నాయకుల త్యాగాలతో నిర్మితమైన బిజెపి.. క్రమశిక్షణ గల 'క్యాడర్ బేస్' పార్టీ నుండి నేడు ప్రజల్లోకి దూసుకెళ్లి 'మాస్ బేస్' పార్టీగా అవతరిస్తోందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పట్ల విసిగిపోయిన యువత, మహిళలు, ఐటీ ఉద్యోగులు, విద్యావంతులు ఒక కొత్త రాజకీయ మార్పును కోరుకుంటున్నారని, ఆ నమ్మకమే బిజెపి అని తెలిపారు. బిజెపి సిద్ధాంతంలో, మేనిఫెస్టోలో భాగమైన ఆర్టికల్ 370 రద్దును ఏ విధంగా సాధించామో, అదే విధంగా దేశానికి యూనిఫామ్ సివిల్ కోడ్ కూడా అంతే అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఉత్తరాఖండ్, గోవా, అస్సాం రాష్ట్రాలు ఈ చట్టాన్ని తీసుకొచ్చాయని.. అస్సాం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రశంసనీయమని కొనియాడారు.

# విజయసాయి విచారణ

ఏడున్నర గంటల పాటు ఈడీ సుదీర్ఘ విచారణ

ఢిల్లీ, మహా. : సంచలనం రేపుతున్న ఆంధ్రప్రదేశ్ లిక్కర్ కుంభకోణం కేసు దర్యాప్తులో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మనీలాండరింగ్ వ్యవహారం, నిధుల మళ్లింపు ఆరోపణలపై అధికార పార్టీకి చెందిన సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా విచారించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో ఏకంగా ఏడున్నర గంటల పాటు ఆయనను దర్యాప్తు సంస్థ అధికారులు పలు కోణాల్లో ప్రశ్నించి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. మద్యం విధానంలో జరిగినట్లుగా చెబుతున్న అవకతవకలు, ఆర్థిక లావాదేవీల వెనుక ఉన్న అసలు వ్యక్తుల గురించి ఈ విచారణలో అధికారులు ప్రధానంగా ఆరా తీసినట్లు తెలుస్తోంది. సుదీర్ఘ విచారణ ముగిసిన తదనంతరం ఈడీ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీ లిక్కర్ స్కాంతో తనకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి సంబంధం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. తనపై వస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమైనవని ఆయన తోసిపుచ్చారు. "తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సాక్షిగా చెబుతున్నాను.. నేను ఈ కేసులో ఎలాంటి నేరమూ చేయలేదు. నా చేతులు పూర్తిగా శుభ్రంగా ఉన్నాయి" అని ఆయన అత్యంత స్పష్టంగా మీడియా ప్రతినిధుల ముందు ఉద్ఘాటించారు. దర్యాప్తు సంస్థ అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకు తాను నిజాయతీగా సమాధానం చెప్పానని, విచారణ ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించానని ఆయన వివరించారు.



ఇదే క్రమంలో ఈ మొత్తం కుంభకోణానికి అసలు బాధ్యులెవరన్న దానిపై విజయసాయిరెడ్డి బాంబు పేల్చారు. ఏపీ లిక్కర్ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక వ్యక్తి రాజ్ కేసిరెడ్డి పైనే ఆయన నేరుగా తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ లిక్కర్ వ్యవహారం, అందులో జరిగినట్లుగా భావిస్తున్న ఆర్థిక లావాదేవీలకు సంబంధించి "కర్త, కర్మ, క్రియ.. అన్నీ ఆ రాజ్ కేసిరెడ్డే" అని విజయసాయిరెడ్డి తేల్చిచెప్పారు. ఆ వ్యక్తి వ్యాపార లావాదేవీలతో తనకు ఎలాంటి వ్యక్తిగత, వ్యాపార సంబంధాలు గానీ లేవని ఆయన స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగానే కొందరు తన పేరును ఈ వ్యవహారంలోకి లాగుతున్నారని, అయితే చట్టం ముందు వాస్తవాలు ఎప్పటికైనా నిలబడతాయన్న పూర్తి నమ్మకం తనకు ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏడున్నర గంటల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ విచారణలో విజయసాయిరెడ్డి ఇచ్చిన సమాచారం, వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారన్న దానిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

# పటిష్టవంతంగా నీట్ రీటెస్ట్

**న్యూఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 21 నిర్వహించే రీటెస్ట్‌లో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ ప్రక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలించాలని నిర్ణయించింది. ఢిల్లీలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఢిల్లీలోని తన నివాసంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ రీటెస్ట్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సుమారు 40 నిమిషాల పాటు జరిగిన సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, పీఎంఓ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పేపర్ తయారు చేయడం, ప్రింటింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, పరీక్షా కేంద్రాలకు చేర్చడం వంటి ప్రతి ప్రక్రియను ప్రధాన మంత్రి కార్యాలయం పర్యవేక్షించనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. నీట్ రీ టెస్ట్‌కు సంబంధించిన పరిణామాలను ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి ప్రతి అప్‌డేట్‌ను మోదీ తెలుసుకుంటున్నారని వివరించాయి.మే 3న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన నీట్ యూజీ 2026 పరీక్షను పేపర్ లీక్ అయ్యిందన్న కారణంతో మే 12న రద్దు చేశారు. అనంతరం జూన్ 21న రీ టెస్ట్ పెడతామని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. కాగా, మే 3న దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో మొత్తం 5,400కు పైగా కేంద్రాల్లో నీట్ యూజీ పరీక్ష జరిగింది. 22 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ ఎగ్జామ్ రాశారు. అయితే ప్రశ్నాపత్రం లీక్ కారణంగా ఎగ్జామ్ రద్దవ్వడంతో వారు మరోసారి జూన్ 21న పరీక్షను రాయనున్నారు. మరోవైపు నీట్ యూజీ పేపర్ లీక్‌పై రాజకీయ పార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి. పరీక్షల నిర్వహణలో కేంద్ర సర్కార్ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వరుసగా జరుగుతున్న నీట్ పేపర్ లీక్‌లకు ప్రభుత్వ ఉదాసీనతే కారణమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వంలో పేపర్ లీక్ మాఫియా వర్ధిల్లుతోందని ఆరోపించారు. కానీ బాధ్యత వహించాల్సినవారు మాత్రం కూర్చొని వేడుక చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శల నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్రం, నీట్ రీ టెస్ట్‌పై దృష్టి సారించింది.

# పౌరుల సంక్షేమంపై యూనిఫైడ్ కార్డ్

**సీఎం రేవంత్ సూచన**

హైదరాబాద్, మహా : పౌరుల సమగ్ర సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు రూపొందించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎవరికి ఎంత లబ్ధి జరుగుతుందో తెలిసేలా ఈ కార్డులు ఉండాలన్నారు. అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటా సేకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలనూ సేకరించాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డు'ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.



ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలన్నారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు.

# చేతనైతే చేసి చూపించు

**20లక్షల ఇండ్ల గృహప్రవేశాలు అయ్యాకే పొంగులేటి ప్రజలను ఓట్లు అడగాలి**

**మంత్రికి కేటీఆర్ సవాల్**

హైదరాబాద్, మహా : 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇచ్చాకే ఓట్లు అడుగుతామని మంత్రి పొంగులేటి అన్నారని, ఇచ్చినమాటను నిలబెట్టుకునే దమ్ము ఆయనకి లేదా అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన సవాల్ పై ఆయన ఎక్స్ లో స్పందించారు. శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. సవాల్ చేసిన దానిప్రకారం 20 లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు అయ్యాకే పొంగులేటి ప్రజలను ఓట్లు అడగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మాదిరిగా తాము డబ్బా ఇళ్లు, 70 వేలతో అగ్గిపెట్టె ఇండ్లు కట్టలేదని, మేం కట్టిన ఒక్కో



డబుల్ బెడ్రూమ్ ఇల్లు.. 7 ఇందిరమ్మ ఇళ్లకు సమానమని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తమ పార్టీ ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ అన్నారు.

# అకాల వర్షాలనూ మీ రాజకీయాల కోసం వాడుకోవద్దు

**హైదరాబాద్, మహా :** అకాల వర్షాలనూ రాజకీయాల కోసం వాడుకోవద్దని ప్రతిపక్షాలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చురకలంటించారు. పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి రైతుల ఆదాయం రెట్టింపు చేయకపోగా ఎరువుల ధరలు పెంచి, నల్ల చట్టాలతో తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ తెలంగాణలో రైతు గోస – బీజేపీ భరోసా పేరిట పొలిటికల్ యాత్రలు చేస్తోందని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో విమర్శించారు. అది 'రైతు గోస' కాదని... అధికారం కోసం బీజేపీ నాయకులు పెడుతున్న 'రాజకీయ ఘోష' అని మండిపడ్డారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా అన్నదాతలకు అన్యాయం చేస్తుందెవరో ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయమని అడగటానికి వెళ్తే మీ వాళ్లకు నూకలు తినటం అలవాటు చేయండంటూ అవమానించిన మీ కేంద్ర మంత్రుల చరిత్రను మర్చిపోయారా...? అని బీజేపీ నాయకులను మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు. అప్పట్లో మన రైతుల పక్షాన నిలబడకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారా అంటూ ఎద్దేవా చేశారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే ఇక్కడ పొలిటికల్ టూర్లు చేస్తూ కాలక్షేపం చేయొద్దని హితవు పలికారు. ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ రైతాంగానికి న్యాయంగా రావాల్సిన హక్కులను, నిధుల్ని సాధించుకు రావాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు రైతాంగానికి ధైర్యం చెప్పి, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా అన్నదాతలకు అండగా నిలవాల్సిన బీఆర్ఎస్.. ఆ పని పక్కనబెట్టి, కేవలం రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పారదర్శకంగా, రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరుపుతుంటే ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా డైవర్షన్ పాలి'ట్రిక్స్' చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆటంకాలు సృష్టించినా, ఎన్ని కుట్రలు చేసినా... చివరి గింజ కొనే వరకు అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ ఎస్ నాయకుల దుష్ప్రచారాన్ని నమ్మి ఆందోళనకు గురి కావొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.

## హర్మూజ్ సమీప ఇరాన్ స్థావరాలపై అమెరికా దాడులు

**మహా :** ఒకవైపు ఇరాన్‌తో శాంతి చర్చలు కొనసాగిస్తున్నామని చెబుతూనే మరోవైపు అమెరికా సైనిక చర్యలకు దిగుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పలు ఇరాన్ డ్రోన్లను కూల్చివేసినట్లు అమెరికా రక్షణశాఖ వెల్లడించింది. హర్మూజ్ ప్రాంతంలో తమ సైన్యానికి ముప్పు పెరుగుతోందని, అందుకే ముందస్తు చర్యగా ఈ దాడులు చేపట్టామని అధికారులు తెలిపారు. ఇక ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చర్చలు విఫలమైతే తాము వెనక్కి తగ్గబోమని, అవసరమైతే రక్షణ మంత్రిని రంగంలోకి దించి పని పూర్తిచేస్తామంటూ హెచ్చరించారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఉన్నాయని ఇరాన్ భావిస్తోందని, కానీ తాను ఎన్నికలను పట్టించుకోనని ట్రంప్ వ్యాఖ్యానించారు. "ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదు. అది కేవలం అమెరికా కోసమే కాదు. ప్రపంచ భద్రత కోసం చేస్తున్న పని అని ట్రంప్ స్పష్టం చేశారు.

ఇరాన్ నాయకత్వం అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటోందని, కానీ ఇప్పటివరకు సరైన పురోగతి కనిపించలేదన్నారు. "ఇప్పటివరకు మేము సంతృప్తిగా లేం. కానీ చివరికి అవుతాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

# బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

## ఈద్గా వద్ద ముస్లీం లకు శుభాకాంక్షలు తెలిపిన అసెంబ్లీ ఇంచార్జి








**ఆదిలాబాద్ మహా :** దేశంలో అన్ని మతాలు సమాన మని గంగా,యమున సరస్వతీ నదుల సంగమంలా అందరూ సోదరభావంతో కలిసి మెలసి జీవించాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం బక్రీద్ పండగను పురస్కరించుకొని పట్టణంలోని ఈద్గాను ఆయన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సందర్శిం చారు. ప్రార్ధనల అనంతరం ముస్లీం సోదరులను ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలిపారు. ఆదిలాబాద్ లో కుల మత బేధాలు లేకుండా హిందూ, ముస్లీం, క్రైస్తవులు, సిక్కులు సోదర సోదరీ భావంతో జీవిస్తున్నారని ,ఒకరి పండగలో మరొకరు పరస్పర సహకారం చేసుకుంటూ ఆనందోత్సహా లతో పండగలు జరుపుకుంటున్నారని ఆయన అన్నారు. ఇది ఇలాగే కలకాలం కొనసాగాలని అన్ని మతాలు మతసామరస్యం పాటిస్తూ ఆనందంగా జీవించాలని ఆయన ఆకాక్షించారు. త్యాగం ,భక్తి ,ప్రేమ, సహనానికి నిదర్శనంగా బక్రీద్ పండగ ని లుస్తుందని ఆయన బక్రీద్ పండగ ప్రత్యేకతను చాటి చెప్పారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ముస్లీం సోదర సోదరీ మణులకు ఆయన బక్రీద్ పండగ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ , మాజీ కౌన్సిలర్ బండారి సతీష్ ,కొండ గంగాధర్ , పత్తి ముజ్జు,ఎంఏ షకీల్ ,ఎల్టి భోజారెడ్డి , సుధాకర్ గౌడ్, మంచాల మల్లయ్య, దాసరి ఆశన్న , రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







## జిల్లా వ్యాప్తంగా ఘనంగా బక్రీద్

### ఈద్గాల వద్ద ముస్లీంల ప్రార్థనలు

**ఆదిలాబాద్ మహా** : త్యాగం,భక్తి , ప్రేమ, కరుణ, సహనానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ముస్లీంలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం తెల్లవారుజామునే ముస్లీం సోదరులు సాంప్రదాయ నూతన వస్త్రాలు ధరించి మసీదులకు చేరుకున్నారు. ఆది లాబాద్ పట్టణంలోని ఈద్గా వద్ద పెద్దఎ త్తున హాజరైన ముస్లిం సోదరులు ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్ధనల అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అటు బక్రీద్ సందర్భంగా గురువారం ఈద్గా మైదానం వద్ద బందోబ స్తు ప్రక్రియను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అదనపు ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలతో కలిసి పరిశీలిం చారు. జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ప్రదేశాలు మసీదుల వద్ద పికెట్స్ ఏర్పాటు చేసారు. జిల్లా వ్యాప్తంగా ముస్లీంల ప్రార్ధనలు ప్రశాంతం గా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు.మరోవైపు కలెక్టర్ ఎస్పీ పలువురు రాజకీయ ప్రముఖులు ముస్లీంలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.



# ఉపాధి కూలీలకు అండగా ఉంటాం :కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** జైనథ్ మండల పర్యటనలో భాగంగా మండల కేంద్రంలో పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలను ఆది లాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కలిసారు. వారితో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు చేస్తున్న పనులను పరిశీలించా రు. మండల కేంద్రం నుండి దాదాపు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పని ప్రదేశం నుండి నడుచుకుంటూ వస్తున్నా మని ఆర్టీసీ బస్సు ఆపడంలేదని కూలీలు కంది శ్రీనివాస రెడ్డి దృష్టికి తెచ్చారు.వెంటనే ఆయన డీయం కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. ఉపాధి కూలీలు మధ్యలో ఎక్కడ బస్సు ఆపినా వారికి అనుకూలంగా ఉండాలని డీయం ను కోరారు. ఇందుకు డీయం సానుకూలంగా స్పందించారు. తమ సమస్య తీర్చినందు కు ఉపాధి కూలీలు కంది శ్రీనివాస రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఏ సమస్యలు ఉన్నా తాను అండగా ఉంటానని కూలీలకు ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రుకేష్ రెడ్డి , మాజీ కౌన్సిలర్ బండారి సతీష్, కొండ గంగాధర్ , గడ్డం జగదీష్ రెడ్డి , రాంరెడ్డి జైనథ్ మండల నాయకులు కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాల్సిందే

**రాహుల్ గాంధీ ధ్వజం.**

**ఢిల్లీ, మహా.** దేశంలో వైద్య విద్య ప్రవేశాల పరీక్ష 'నీట్ యూజీ' ఫలితాలపై వెల్లువెత్తుతున్న తీవ్ర వివాదం, పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి తక్షణ మే రాజీనామా చేయాలని, లేదా ప్రధాని ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలని లోక్‌సభ ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పరీక్షలు రాసిన 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ఈ ప్రభుత్వం అంధకారంలో కి నెట్టేసిందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజధానిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను, ఎన్‌టీఏ తీరును ఎండగట్టారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు జరిగిన అన్యాయంపై తాము రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎగ్జామినేషన్ వ్యవస్థను ఈ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒకవైపు పరీక్షల్లో అవ కతవకలు జరిగాయని దేశమంతా కోడైకూస్తున్నా, గుజరాత్, బీహార్, హర్యానా వంటి రాష్ట్రాల్లో పేపర్



లీక్ ముఠాలు అరెస్ట్ అవుతున్నా కేంద్ర మంత్రి ధర్మేం ద్ర ప్రధాన్ మాత్రం ఏమీ జరగనట్లే కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులు రేయింబగళ్లు కష్టపడి చదివితే, ధనబలం ఉన్న కొందరు అక్రమార్కులు పేపర్లను ముందే కొనుగోలు చేసి ర్యాంకులు సాధిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. "ఇది కేవలం ఒక పరీక్షకు సంబం ధించిన సమస్య కాదు.. లక్షలాది మంది విద్యార్థుల కన్నీళ్లు, వారి తల్లిదండ్రుల జీవితకాల శ్రమను హరిం చడమే" అని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకు ప్రతిపక్షాలపై బురదజల్లే రాజకీయాలకు కేంద్ర ప్రభుత్వం తెరతీ సిందని, అయితే నన్ను ఎంత విమర్శించినా, ఎన్ని రకాలుగా వేధించినా కేంద్రం చేసిన తప్పులను దాచ లేరని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. విద్యా వ్యవస్థను కాషాయీకరణ చేసే క్రమంలో భాగంగానే అసమ ర్థులను కీలక పీఠాలపై కూర్చోబెట్టారని, దీని ఫలి తంగానే వరుసగా పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దులు జరుగుతున్నాయని విమర్శించారు. విద్యా శాఖకు నాయకత్వం వహించే అర్హత ధర్మేంద్ర ప్రధాన్‌కు లేదని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఆయన వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు.

దేశ భవిష్యత్తును నిర్దేశించే 18.5 లక్షల మంది విద్యార్థుల పక్షాన తాము నిలబడతామని, పార్ల మెంట్ లోపలా, వెలుపలా ఈ అన్యాయంపై గట్టిగా ప్రశ్నిస్తామని రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఈ నీట్ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, ఎన్‌టీఏ వ్యవస్థ లో సమూల మార్పులు తెచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ ఈ పోరాటాన్ని ఆపబోదని స్పష్టం చేశారు.

## పర్సనల్, సివిల్ అధికారుల సమన్వయంతోనే వృద్ధి సాధ్యం

**మందమర్రి, మహా** : పర్సనల్, సివిల్ అధికారుల సమ న్వయంతోనే వృద్ధి సాధ్యమని సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ వాక్యానిం చారు.గురువారం స్థానిక జి ఎం ఛాంబర్ లో పర్సనల్, అకౌంట్స్, సివిల్ విభాగాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలంటే అన్ని విభాగాలు సమన్వయం తో పనిచేయాలని ఆయన హితవు పలికారు. ప్రస్తుతం ఏరియాలో జరుగుతున్న ఆయా విభాగాల వారీగా జరుగు తున్న పనులు, సాధించిన పురోగతిపై జీ.ఎం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. సింగరేణి ప్రగతిలో ప్రతి విభాగం ఒక కీలకమైనదని, అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వ యంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహ రించి మందమర్రి ఏరియాను అగ్రగామిగా నిలపాలని జిఎం పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏటీఎం (ఎఫ్ అండ్ ఏ) ఆర్ వి ఎస్ ఆర్ కె ప్రసాద్, డీజీఎం పర్సనల్ సిహెచ్ అశోక్, డీజీఎం (ఐ ఈ డి) కిరణ్ కుమార్, సివిల్ ఎస్సీ శ్రీధర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, అన్ని గనుల సంక్షేమ అధికారులు, సివిల్ అధికారులు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

### రైతులు ఇబ్బంది పడవలసిన అవసరం లేదు...

# ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం


**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

**మంచిర్యాల, మహా :** రైతులు ధాన్యం కొనుగోలు విషయంలో ఇబ్బంది పడవలసిన అవసరం లేదు... చివరి ఆఖరి గింజ వరకు కొనుగోలు చే స్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం చెన్నూర్ మండలం బా వురావుపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఇతర ప్రభుత్వ అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్ర భుత్వం రైతు సంక్షేమంలో భాగంగా అనేక కార్య క్రమాలు చేపడుతుందని చెప్పారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం ఎకరానికి 25 క్విం టాళ్ల ధాన్యం వచ్చేదని, ఈసారి 28 నుండి 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి పెరిగిందని వివరిం చారు. చెన్నూర్, కోటపల్లి ప్రాంతాలలో పంట ఆలస్యంగా వస్తున్నందున జూన్ 15 వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. 202223 లో 1 లక్ష 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈసారి ఇప్పటివరకు 1 లక్ష 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు స్పష్టం చేశారు. జూన్ 6 వరకు 30 వేల నుండి 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తా మని వివరించారు. మొత్తంగా దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగు మతులను వేగవంతం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. లారీలు సమకూర్చడం కొరకు సింగరేణి సంస్థతో మాట్లాడడం జరిగిందని, ఇసుక లారీలను ధాన్యం రవాణాకు మళ్ళించడం జరిగిందని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను ఆందోళన చేపట్టే దిశగా రెచ్చగొడుతున్నారని చెప్పారు. పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం కలిసి రావాలని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగు తుందని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూర్ మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చురుగ్గా కొనసాగుతుందని అన్నారు. జైపూర్ మండలంలో వచ్చే 3 రోజులలో ధాన్యం ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేప థ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని జైపూర్ మండలంలో గల సుముఖ గోదాములోనికి చెన్నూర్ నుండి వచ్చే ధాన్యాన్ని అనుమతించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజక వర్గ పరిధిలో ఇప్పటివరకు 70 శాతం ధాన్యం ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, చెన్నూర్, కోటపల్లి మండలాలకు సంబంధించి ధాన్యం ప్రక్రియను 15 రోజులలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 7 నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉందని, ఈలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివ రించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ చెన్నూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను పరిశీ లించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగాల వెల్లువ..



**మంగళగిరి,మహా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయని, ఈ భారీ అవకాశాలను అందుపుచ్చుకునేందుకు యువత అంకితభావం, నైపుణ్యాలతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువతను అంతర్జాతీయ స్థాయి మానవ వనరులుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మహానాడు ఉత్సవాల సందర్భంగా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో 'జెన్‌జీ' (GenZ) ప్రతినిధులతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు అడిగిన పలు ఆసక్తికరమైన ప్రశ్నలకు ఆయన ఓపిగ్గా సమాధానాలిస్తూ, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిపై ప్రభుత్వ దార్శనికతను సుదీర్ఘంగా వివరించారు.

రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని సరికొత్త పుంతలు తొక్కించేందుకు ప్రభుత్వం క్లస్టర్ ఆధారిత విధానంతో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా డేటా, ఐటీ, క్వాంటం టెక్నాలజీ రంగాలతో పాటు రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలు జిల్లాలో పునరుత్పాదక ఇంధన వనరుల పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఈ విధానం ద్వారా ఒకే ప్రాంతంలో ప్రధాన పరిశ్రమలతో పాటు వాటికి అనుబంధంగా ఉండే విడిభాగాల తయారీ యూనిట్లు కూడా కొలువుదీరుతాయని, తద్వారా పటిష్టమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకోసిస్టమ్) సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రానికి దాదాపు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, రిలయన్స్ వంటి ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని లోకేష్ పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యారంగంలో కీలక మార్పులు తెచ్చి పాఠ్యప్రణాళికను ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు.ఇదే సమయంలో సోషల్ మీడియాలో విస్తృతంగా సాగుతున్న తప్పుడు ప్రచారాలు, ఫేక్ కంటెంట్‌పై యువత నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి తరహాలోనే హెచ్చరించారు. డీఎస్సీ నోటిఫికేషన్ విషయంలో ప్రతిపక్షాలు కావాలనే నిరాధార ఆరోపణలు సృష్టించి లక్షలాది మంది నిరుద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేశాయని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా కేవలం 150 రోజుల రికార్డు వ్యవధిలోనే డీఎస్సీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిందని గుర్తుచేశారు. సోషల్ మీడియాలో వచ్చే ఏ సమాచారాన్నైనా గుడ్డిగా నమ్మకుండా, వాస్తవాలను తార్కికంగా సరిచూసుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. విజయానికి ఎలాంటి సులువైన దారులు (షార్ట్‌కట్లు) ఉండవని, నిరంతర శ్రమ, పట్టుదల మాత్రమే మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడతాయని లోకేష్ తన వ్యక్తిగత రాజకీయ జీవితానుభవాలను యువతతో పంచుకున్నారు. 'మా నాన్నగారు చంద్రబాబు నాయుడు గారితో నేను పోటీ పడాలంటే, ఆయన కంటే రెట్టింపు కష్టపడాలి. నా పాదయాత్రలో ఎన్నో సవాళ్లను, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నాను. 2019 ఎన్నికల ఓటమితో నేను ఎప్పుడూ అధైర్యపడలేదు. మరింత పట్టుదలతో పోరాడి 2024లో ఏకంగా 91 వేల ఓట్ల భారీ మెజారిటీతో మంగళగిరిలో గెలిచాను. ఆనాడు ఓటమికి భయపడి ఉంటే ఈ రోజు ఈ విజయం దక్కేది కాదు" అని ఉద్ఘాటించారు. కేవలం పరీక్షల్లో విఫలమయ్యామనే బాధతో విద్యార్థులు ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, ఒక ఓటమి జీవితాన్ని ఎన్నటికీ శాసించలేదని ధైర్యం చెప్పారు.దేశంలో మార్పు రావాలంటే చదువుకున్న యువత పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి రావాలని, వారికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ సముచిత స్థానాన్ని, అవకాశాలను కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రతి ఇంటి నుంచే మహిళా సాధికారత ప్రారంభం కావాలని, స్థానిక సంస్థల్లో వారికి 33 శాతం రిజర్వేషన్ల సమర్థవంతమైన అమలుకు సమాజమంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే ఏకైక అజెండాగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, బడా పరిశ్రమలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ ఆత్మీయ సదస్సులో పలు యూనివర్సిటీలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు వేమూరి సాత్విక్, చరణ్ యాదవ్, సత్యసాయి పవన్ కుమార్, ఖ్యాతి వర్ధిని పాల్గొని మంత్రి లోకేష్‌తో తమ ఆలోచనలను పంచుకున్నారు.





















# మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలపై కీలక చర్చలు**

**బూర్గంపహాడ్ మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలోని ఐటీసీ ప్రాంగణంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రాష్ట్ర మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, నియోజకవర్గ ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం.ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించినట్లు తెలిపారు. అలాగే ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అభినందించారు.ఈ సందర్భంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని, నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది.ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఐటీసీ ప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్న మంత్రి సీతక్క



**భద్రాచలం మహా** : తెలంగాణ రాష్ట్ర మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు ధనసరి అనసూయ (సీతక్క) గురువారం నాడు భద్రాచలం లోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న మంత్రి సీతక్కకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి, రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, శాంతి, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేసి, స్వామివారి తీర్థప్రసాదాలు మరియు శేషవస్త్రాలతో మంత్రిని సత్కరించారు. ఆలయ సందర్శన సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మంత్రిని పలకరించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎం ఎల్ ఏ, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, అభిమానులు మరియు భక్తులు పాల్గొన్నారు.



# పరిశుభ్రతపై అవగాహన అవసరం..

- **వైద్యాధికారి సునీల్..**

**మణుగూరు, మహా** : మహిళలు, కిశోర బాలికలు నెలసరి పరిశుభ్రతపై సరైన అవగాహన కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీల్ పేర్కొన్నారు. జాతీయ ఋతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా గురువారం మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 28న జాతీయ ఋతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా నెలసరి సంబంధిత అపోహలు, మచ్చ, అపహాస్యాన్ని తొలగించి ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశమన్నారు. మహిళలు పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు. అనంతరం నెలసరి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే గర్భిణీ స్త్రీల కోసం ప్రత్యేక క్లినిక్ నిర్వహించి రక్త పరీక్షలు చేపట్టారు. సాధారణ ప్రసవం కోసం చేయవలసిన వ్యాయామాలపై వివరించి, గర్భిణీలు తీసుకోవాల్సిన పోషకాహారం, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ పావని, డి. పరంగిణి ఆరోగ్య విద్యాధికారి, సత్తెమ్మ ప్రజారోగ్య నర్సింగ్ సిబ్బంది, జానకి ఆరోగ్య పర్యవేక్షకురాలు, రాంప్రసాద్, కృష్ణ ఆరోగ్య సహాయకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఘన నివాళులు

- **తెలుగు ఆత్మగౌరవ ప్రతీకగా కొనియాడిన ఎమ్మెల్యే**
- **డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**భద్రాచలం మహా** : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మహానేత స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా భద్రాచలం కునవరం రోడ్డులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానాయకుడని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన రూ.2 కిలో బియ్యం పథకం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని గుర్తు చేశారు.తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడిగా, రాజకీయాల్లో విలువలకు ప్రతీకగా ఎన్టీఆర్ నిలిచారని, ఆయన సేవలు తరతరాలకు ఆదర్శంగా ఉంటాయని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రత్నం రమాకాంత్, నర్రా రాము, అరికెల్ల తిరుపతి రావు, భీమవరపు వెంకటరెడ్డి, దుద్దుకురి సాయిబాబా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆకుల వెంకట్‌తో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ."ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత ఎన్టీఆర్‌కు ఇదే నిజమైన నివాళి" అని పలువురు నాయకులు పేర్కొన్నారు.

# రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- **ప్రజలకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలి..**
- **మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామ్‌చందర్ ..**



**మణుగూరు, మహా** : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మణుగూరు ఏరియాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామ్‌చందర్ సూచించారు. గురువారం పీవీ కాలనీ భద్రాద్రి స్టేడియంలో జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 2 ఉదయం కమ్యూనిటీ హాల్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూజలు, పూలమాల ఆవిష్కరణతో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం, హనుమాన్ టెంపుల్ సమీపంలోని అమరవీరుల స్థూపం, కొమరం భీమ్ విగ్రహం, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారని చెప్పారు. తర్వాత జీఎం కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ నిర్వహించి సభా కార్యక్రమం చేపడతామన్నారు. సభలో మణుగూరు ఏరియాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, సేవా సభ్యులు, సింగరేణి పాఠశాల విద్యార్థులను సన్మానిస్తామని తెలిపారు. సాయంత్రం పీవీ కాలనీ భద్రాద్రి స్టేడియంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రముఖ కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వేడుకలకు అధిక సంఖ్యలో సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున తగినన్ని కుర్చీలు, మంచినీటి సౌకర్యం, లైటింగ్, మహిళల భద్రత కోసం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన వేదికను కళాత్మకంగా అలంకరించి వేడుకలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. స్టాల్స్ ఏర్పాటు చేసుకునే వ్యాపారులు పరిశుభ్రత పాటిస్తూ నాణ్యమైన తినుబండారాలు అందించేలా నిబంధనలు అమలు చేయాలని పేర్కొన్నారు. జూన్ 2న నిర్వహించే వేడుకల్లో సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం బి శ్రీనివాసదారి, ఏఎస్ఓ డివి రామారావు, ఏజీఎం ఐఈడీ సిహెచ్ రాంబాబు, ఏజీఎం పర్సనల్ ఎస్ రమేష్, కేపీయూజీ ప్రాజెక్టు అధికారి వేణు మాధవ్, ఎంఎన్జీఓసీ ప్రాజెక్టు అధికారి ఈ. శ్రీనివాస్, కేసీహెచ్పీ డీజీఎం మధన్ నాయక్, సివిల్ డీజీఎం జి. శివప్రసాద్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి కే. స్వప్న, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

**స్టాల్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం..**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా పీవీ కాలనీ భద్రాద్రి స్టేడియంలో తినుబండారాలు, ఇతర వ్యాపార స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలనుకునే వ్యాపారులు ఈ నెల 31 సాయంత్రం 5 గంటలలోగా పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో సమర్పించాలని డీజీఎం పర్సనల్ రమేష్ విజ్ఞప్తి చేశారు.

# చికెన్ కర్రీలో బల్లి కళేబరం!.

- **ఆహార భద్రతా అధికారుల నిర్లక్ష్యంపై భగ్గుమంటున్న జనం.**
- **దాబా వద్ద వినియోగదారుల ఆందోళన.**
- **పరారీలో నిర్వాహకులు**

**ఖమ్మం,మహా** : నోరూరించే రుచుల కోసం హోటళ్లకు వెళ్లే భోజన ప్రియులకు ఒళ్లు గగుర్పొడిచే చేదు అనుభవం ఎదురైంది. కమ్మటి కూరలో ఏకంగా మృత్యువు కానవచ్చిన దారుణ ఘటన ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో తీవ్ర కలకలం రేపింది. కోదాడ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఓ ప్రైవేట్ దాబాలో కస్టమర్లు ఆర్డర్ చేసిన చికెన్ కర్రీలో ఉడికిన బల్లి కళేబరం దర్శనమివ్వడం స్థానికంగా భయాందోళనలకు దారితీసింది. కాసుల కక్కుర్తితో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న దాబా నిర్వాహకుల తీరు, చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారుల ఉదాసీనతపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

**కూరలో బల్లి.. కంగుతిన్న కస్టమర్లు**

భోజనం కోసం కోదాడ క్రాస్ రోడ్డులోని సదరు దాబాకు వెళ్లిన వినియోగదారులు ఎంతో ఇష్టంగా చికెన్ కర్రీ ఆర్డర్ చేసుకున్నారు. గుమగుమలాడుతూ వచ్చిన కూరను తినేందుకు సిద్ధమవుతున్న క్రమంలో గిన్నెలో బల్లి కళేబరం కనిపించడంతో కస్టమర్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తాము డబ్బులు చెల్లించి తింటున్న ఆహారంలో ఇంతటి దారుణమైన నిర్లక్ష్యం జరగడం, విషతుల్యమైన ఆహారాన్ని వడ్డించడం చూసి తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. వంటగదిలో కనీస పరిశుభ్రత, ఆరోగ్య ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని వినియోగదారులు మండిపడ్డారు.

**నిర్వాహకులతో తీవ్ర వాగ్వాదం.. పరిస్థితి ఉద్రిక్తం**

బల్లి కళేబరం ఘటనతో ఆగ్రహంతో ఊగిపోయిన కస్టమర్లు వెంటనే దాబా నిర్వాహకులను నిలదీశారు. "మనుషుల ప్రాణాలంటే అంత లెక్కలేకుండా పోయిందా?" అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ క్రమంలో కస్టమర్లకు, హోటల్ యజమాన్యానికి మధ్య వాగ్వాదం పెరిగిపోయి ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న స్థానికులు కూడా పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని వినియోగదారులకు మద్దతుగా ఆందోళనకు దిగారు. దాబాను మూసివేయాలంటూ నినాదాలు చేశారు. పరిస్థితి క్రమంగా చెయ్యి దాటిపోతుండటం, జనం ఆగ్రహం కట్టలు తెంచుకోవడంతో భయాందోళనలకు గురైన హోటల్ యజమాని, సిబ్బంది అక్కడి నుంచి రాత్రికి రాత్రే పరారయ్యారు.

**ఫుడ్ సేఫ్టీ అధికారుల తీరుపై విమర్శల వెల్లువ**

ఈ దారుణ ఘటనకు సంబంధించి స్థానికులు వెంటనే ఫుడ్ సేఫ్టీ (ఆహార భద్రత) అధికారులకు సమాచారం అందించారు. అయితే, క్షేత్రస్థాయిలో అధికారుల పనితీరుపై ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. గత కొన్ని నెలలుగా ఎదులాపురం పరిసర ప్రాంతాల్లోని పలు హోటళ్లు, దాబాలలో కుళ్లిన మాంసాన్ని యథేచ్ఛగా వినియోగిస్తున్నారని, ఫ్రిజ్‌లలో వారాల తరబడి నిల్వ ఉంచిన పదార్థాలనే వేడి చేసి పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని, కనీస తనిఖీలు సైతం చేపట్టకపోవడం వల్లే హోటల్ నిర్వాహకులు ఇలా బరితెగిస్తున్నారని విమర్శిస్తున్నారు. ముడుపులకు ఆశపడి ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**కఠిన చర్యలకు స్థానికుల డిమాండ్**

ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వ్యాపారం చేస్తున్న ఇలాంటి దాబాలను, హోటళ్లను వెంటనే సీజ్ చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేవలం నామమాత్రపు జరిమానాలతో వదిలిపెట్టకుండా, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నిర్వాహకులపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని దాబాలు, రెస్టారెంట్ల వంటగదుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ సేవలు అనంతం

**ఎన్టీఆర్ జయంతి వేడుకలో ఎమ్మెల్యే జారె**

**దమ్మపేట ,మే 28 మహా** : తెలుగు ప్రజల ఆరాధ్యదైవం , మహా నాయకుడు ,చలన చిత్ర పరిశ్రమలో రారాజుగా వెలుగొందిన మహా నేత సేవలు తెలుగుప్రజలకు చిరస్మరణీయంగా గుర్తుంచుకోవాలని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ పేర్కొన్నారు. పట్వారిగూడెం ,మందలపల్లి ,నాచారం ,మొద్దులగూడెం , దమ్మపేట ,తదితర ప్రాంతాల్లో యన్టీఆర్ అభిమానులు ఘనంగా జయంతి ఉత్సవాలు జరిపారు.తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత ఎన్టీఆర్ రాజకీయాలతో పాటు సినీరంగంలోనూ విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రజానాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. తెలుగువారి గౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.



# గ్రామీణ వైద్యుల ప్రథమ చికిత్స కేంద్రాల పై తనిఖీలు నిలిపివేయాలి..

- **ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు వినతి పత్రం**

**చర్ల మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో ఇటీవల కాలములో గ్రామీణ వైద్యుల ప్రథమ చికిత్స కేంద్రాల పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తనిఖీల ప్రత్యేక బృందం ఆకస్మి కంగా తనిఖీలు నిర్వహించి జరిమాణాలు విధిస్తున్నారని,దీంతో గ్రామీణ వైద్యులు తీవ్రం గా నష్టపోయి మానసిక ఆందోళన గురౌతు న్నామని గ్రామీణ వైద్యుల ప్రథమ చికిత్స కేంద్రాలపై అధికారులు తనిఖీలు నిలిపివే యాలని ఆకాంక్షిస్తూ చర్ల పర్యటనకు వచ్చిన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం. వెంకట్రావు గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఆర్.ఎం.పి పిఎంపి సిపి,ఈపి సంఘం జిల్లా అధ్యక్షులు పి.వెంకటే శ్వర్లు,మండల గౌరవ అధ్యక్షులు కొప్పుల రాంబాబు,మండల అధ్యక్షులు తాళ్లూరి రంగారావు,ప్రధాన కార్యదర్శి ఎడారి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని గురువారం అందజేశారు.గ్రామీణ వైద్యులు ఉన్నతమైన చదువులు చదువుకొని ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా మిగిలిపోకుండా స్వయం ఉపాధి కొరకు ఉన్నత చదువులు చదువుకున్న వైద్యులు ఎంబిబిఎస్,ఎంఎస్,ఎండి గైనకాలజిస్ట్,ఆర్థోపెడిక్ క్వాలిఫైడ్ ప్రైవేట్ నర్సింగ్ హోమ్ కార్పొరేట్ వైద్యశాలలోని వైద్యుల దగ్గర ఐదు నుండి పది సంవత్సరాల వరకు పనిచేసిన అనుభవంతోనే గ్రామీణ ప్రాంతాలలోనే నిరుపేద ప్రజలకు గత 20,30 సంవత్సరాల అనుభవంతో ప్రథమ చికిత్సలు అందించి ప్రజలకు సేవ చేస్తూ మా కుటుంబాలను పోషించుకుంటున్నామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ వైద్యులను గుర్తించి మాకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి తలెత్తుతున్న కొత్త కొత్త వ్యాధులపై అవగాహన కల్పించి మా సేవ లను ప్రభుత్వం ఉపయోగించుకోవాలని ఎమ్మె ల్యేకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆకస్మికముగా మా ప్రథమ చికిత్స కేంద్రాలపై తనిఖీలు నిర్వ హించి జరిమానాలు విధించడం వలన మా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఆర్ఎం పి పి.ఎం.పి ప్రథమ చికిత్స కేంద్రాలపై తనిఖీల ను నిలిపివేసి గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం శిక్షణ ఇచ్చిఆదుకోవాలని కోరుతూ ఎమ్మెల్యేకి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు,మండల గౌరవ అధ్యక్షులు కొప్పుల రాంబాబు, పోచం అనంతరాములుమండల అధ్యక్షులు తాళ్లూరి రంగారావు మండల ప్రధాన కార్యదర్శి ఎడారి శ్రీనివాస రావు,మండల మాజీ అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు,మండల సీనియర్ నాయకులు పుప్పాల రంజిత్ కుమార్,కిరణ్ ,దాగం శ్రీనివాస రావు, బోళ్ల వెంకటేశ్వర్లు ,ఇర్పా మురళి,సాధన పల్లి మహేష్,చింత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పంట వ్యర్థాలు తగలబెట్టడం
# చట్టరీత్యా నేరం

- **నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.25 వేల వరకు జరిమానా..**
- **పంట అవశేషాలను నేలలో కలియదున్నాలి..**
- **మణుగూరు ఏఓ రాహుల్ రెడ్డి**

**మణుగూరు, మహా** : వానాకాలం సాగు సీజన్‌కు పొలాలను సిద్ధం చేసే క్రమంలో రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టడం చట్టరీత్యా నేరమని మణుగూరు మండల వ్యవసాయ అధికారి రాహుల్ రెడ్డి హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రభుత్వం ఈ చర్యలను పూర్తిగా నిషేధించినట్లు ఆయన తెలిపారు. గురువారం ఆయన ఏఎన్ఎన్ మహా పత్రికతో మాట్లాడారు.. పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ జారీ చేసిన జీవో నంబర్-27 ప్రకారం పంట అవశేషాల దహనాన్ని నిషేధించినట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి సాధారణ చెత్తను కాల్చితే రూ.5 వేల వరకు, భారీ స్థాయిలో వ్యర్థాలను తగలబెడితే రూ.25 వేల వరకు పర్యావరణ పరిహారం రూపంలో జరిమానా విధిస్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి విడుదల చేసిన ప్రకటనను గుర్తు చేశారు. పంటల అవశేషాలను తగలబెట్టడం వల్ల గాలి కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, ముఖ్యంగా వేసవికాలంలో మంటలు వేగంగా వ్యాపించి ప్రాణ, ఆస్తి నష్టాలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల భూపాలపల్లి జిల్లాలో పంట వ్యర్థాలను కాల్చే సమయంలో చంద్రమౌళి, భాగ్యమ్మ అనే ఇద్దరు రైతులు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటనను ఆయన గుర్తు చేశారు. రైతులు సులభ మార్గంగా భావించి పంట అవశేషాలను తగలబెట్టకుండా, వాటిని నేలలోనే కలియదున్నాలని సూచించారు. దీంతో భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని, రసాయన ఎరువుల వినియోగం తగ్గడంతో పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయని వ్యవసాయ అధికారి రాహుల్ రెడ్డి ప్రత్యేకంగా వివరించారు.



# ఆంధ్రుల అన్న ఎన్.టి.ఆర్ 103వ జయంతి వేడుకలు

**ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి ఘన నివాళి.**

సత్తుపల్లి, మే 28: మహా ఉ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానటుడు నందమూరి తారక రామారావు 103 వ జయంతి వేడుకలు సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొని ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలుగు జాతికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సినీ రంగం, రాజకీయాల్లో ప్రజలకు ఆయన చేసిన సేవ ప్రత్యేకం అన్నారు. ప్రభుత్వ పథకాల రూపకల్పన సామాన్యుడికి ఉపయోగపడే విధంగా రూపొందించడంలో గుర్తింపు పొందిన మహానేత ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో పథకాలు అమలు చేసి పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా, సత్తుపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సీనియర్ నాయకులు చల్లగళ్ళ నరసింహారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు.

# ఘనంగా బక్రీద్ వేడుకలు

**యాదాద్రి భువనగిరి మే 28 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని స్థానిక హైదరాబాద్ చౌరస్తా నూతన ఈద్గా వద్ద గురువారం ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు బక్రీద్ పండుగ త్యాగంనికి ప్రతీక గా ప్రతి ఒక్కరు ఈ పండుగ చేసుకొంటారని ఆయన అన్నారు

ఈ కార్యక్రమం భువనగిరి మున్సిపల్ చైర్మన్ తాంగేళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, అంజుమన్ కమిటీ అధ్యక్షులు MA రహీమ్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అవైస్ చిస్తీ, మున్సిపల్ కౌన్సిలర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.



## జననేత జనక్ ప్రసాద్ కు డాక్టరేట్ గౌరవం

- **సన్మానించిన సింగరేణి సత్తుపల్లి ఏరియా ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు.**

**సత్తుపల్లి, మే 28**: మహా : సింగరేణి కార్మికుల కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐ.ఎన్.టి.యు.సి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ను ప్రభుత్వం డాక్టరేట్ తో సత్కరించడం సంతోషంగా ఉందని సింగరేణి సత్తుపల్లి ఏరియా ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, ఐ.ఎన్.టి.యు.సి యూనియన్ బలోపేతానికి పోరాడే యోధుడు జనప్రసాద్ అన్నారు. ఆయన అధ్యక్షతన సింగరేణి సత్తుపల్లి ఏరియా పరిధిలోని కార్మికుల సమస్యలను సింగరేణి యాజమాన్యంతో చర్చించి త్వరితగతిన పరిష్కారమయ్యే దిశగా చర్యలు చేపడతామని కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సింగరేణి ఐ.ఎన్.టి.యు.సి నాయకులు ఇక్బాల్, మహేష్, మున్నా తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో వికే సీఎం ప్రాజెక్టు ప్రభావిత పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది.ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.ఈ వైద్య శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.సింగరేణి సంస్థ ప్రజల ఆరోగ్య సంక్షేమానికి కట్టుబడి ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ లలిత కుమారి మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపించి ఇలాంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహరావు మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ విక్టర్, ఏఐటీయూసీ నాయకులు ఎం.ఆర్.కే ప్రసాద్, ఐఎన్టియుసి నాయకులు గోపు కుమార్, ఇతర వైద్య సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

- **కలిసిమెలిసి ఉంటూ మతసామరస్యాన్ని చాటాలి**
- **గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలనే మైనార్టీ సోదరుల ఆలోచన ఆదర్శం**
- **సమైక్యతతోనే దేశం మరింత ముందుకు సాగుతుంది**
- **కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సమాజంలో ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని బోడగుట్ట ఏరియాలో ఉన్న ఈద్గాను ఆయన సందర్శించి అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదర కుటుంబాలను కలిసి వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని అందరూ సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మైనార్టీలపై దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటివని సమాజంలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని మైనార్టీ సంఘం నాయకుడు కోరడం అత్యంత అభినందనీయమని ఇది ముస్లింల ఉదార స్వభావానికి నిదర్శనమని శ్లాఘించారు. ఈ ప్రతిపాదనను తాము పూర్తిగా స్వాగతిస్తున్నామని ఇలాంటి ఆలోచనలు సమాజంలో మతసామరస్యాన్ని మరింత పెంపొందిస్తాయని ఆయన స్పష్టం చేశారు. పండుగ రోజున అందరి శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, మైనార్టీ సంఘాల నాయకులు నయీమ్ ఖురేషి, అబిద్ హుస్సేన్, అబ్దుల్ రబ్, అన్వార్ పాషా, యాసీన్, ఎండి యూసుఫ్, ఖమర్, ఫారూఖ్, అమీర్ ఖాద్రి, ఇస్మాయిల్, షకీల్, ఇమ్రాన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

# నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి అంతర్జాతీయ రూపురేఖలు!

- **మంత్రి పొంగులేటి ఆదేశాలతో రూపుదిద్దుకుంటున్న సమగ్ర మాస్టర్ ప్లాన్**
- **చారిత్రక క్షేత్రంలో వారసత్వ శాఖ ఉన్నత స్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన**



**నేలకొండపల్లి, మే 28 మహా:** నేలకొండపల్లి బౌద్ధ మహాస్తూపాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసింది. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ క్షేత్రం అభివృద్ధి కోసం రూ. 2.50 కోట్ల నిధులు మంజూరైన సంగతి తెలిసిందే. అయితే ఈ నిధులతో పాటు ఈ చారిత్రక క్షేత్రానికి అంతర్జాతీయ స్థాయి హంగులు అద్దేందుకు ఇంకా ఎంత వ్యయం అవుతుంది, ఎలాంటి పనులు చేపట్టాలనే అంశాలపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించిన నేపథ్యంలో గురువారం వారసత్వ శాఖ ఉన్నత స్థాయి బృందం ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది.

**డి.పి.ఆర్ రూపకల్పన కోసం ఉన్నత స్థాయి బృందం**

తెలంగాణ వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాటి, బుద్ధవనం ప్రాజెక్ట్ మెంటార్ సి.ఆంజనేయ రెడ్డి నేతృత్వంలోని ఉన్నతాధికారులు, పురావస్తు నిపుణుల బృందం నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని విస్తృతంగా పరిశీలించింది. మంజూరైన రూ. 2.50 కోట్ల నిధుల వినియోగంతో పాటు, భవిష్యత్ నిధుల అంచనాలు, ల్యాండ్ స్కేపింగ్, పర్యాటక హంగుల రూపకల్పనపై నిపుణుల బృందం క్షేత్రస్థాయిలోనే సుదీర్ఘంగా సమీక్షించింది.

**ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ సర్వే**

మాస్టర్ ప్లాన్‌లో భాగంగా, కేవలం ఉపరితల తవ్వకాలకే పరిమితం కాకుండా ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ జియోఫిజికల్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. దీనిద్వారా భూగర్భంలో దాగివున్న చారిత్రక అవశేషాలను శాస్త్రీయంగా వెలికితీసి రక్షించనున్నారు. అలాగే, పర్యాటక వసతుల విస్తరణ కోసం సుమారు నాలుగు ఎకరాల భూమిని సేకరించాలని తీర్మానించారు.

**ఆధునిక పర్యాటక వసతులు**

ఇక్కడ పర్యాటకుల కోసం చరిత్రను ప్రతిబింబించే త్రీడీ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, ఆడియోవిజువల్ గ్యాలరీలు, ఓపెన్ ఎయిర్ అంఫీ థియేటర్, అంతర్జాతీయ స్థాయి వాకింగ్ మార్గాలు, లైటింగ్ వంటి మౌలిక వసతులను ఈ నివేదికలో చేర్చనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు, పూర్తి వ్యయ అంచనాలతో కూడిన ఈ 'సమగ్ర నివేదిక' ను రాబోయే రెండు నెలల్లో ప్రభుత్వానికి సమర్పిస్తామని వారసత్వ శాఖ డైరెక్టర్ వెల్లడించారు.

## త్యాగానికి ప్రతిరూపం, క్రమశిక్షణకు నిదర్శనం బక్రీద్

**ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శుభాకాంక్షలు**



**ఇబ్రహీంపట్నం మహా:** త్యాగానికి, నిస్వార్థానికి, దైవ భక్తికి ప్రతీక బక్రీద్ అని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ముస్లిం సోదరుల పవిత్ర పండుగ బక్రీద్ సందర్భంగా నియోజకవర్గ ముస్లిం సోదరసోదరీమణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మానవ సమాజానికి ప్రేమ, కరుణ, శాంతిని చాటిచెప్పేది ఈ పవిత్ర దినమని... ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. మహాత్మాగాంధీ అభివర్ణించినట్టుగా గంగాజమున తెహజీబ్ సంస్కృతికి ఈ ప్రాంతం నిలయమన్న మల్ రెడ్డి.... సోదరభావంతో, సామరస్యంతో పండుగలు జరుపుకోవడం గొప్పతనంగా పేర్కొన్నారు. ముస్లిం సోదరులంతా పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్న ఆయన.... షాదీ ముబారక్, హజ్ యాత్రికులకు ఏర్పాట్లు, షాదీఖానాలు, మసీదుల అభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు లాంటివి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



## జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- **కష్టపడ్డ కార్యకర్తకు పార్టీలో మంచి గుర్తింపు ఉంటుంది**
- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన నివాసంలో కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ స్థాయి నాయకులు, మహిళా నాయకుళ్లతో గురువారం ముఖ్యమైన సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి విజయం సాధించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. బూత్ లెవెల్ మెంబర్లను గుర్తించి, బూత్ కమిటీలను వేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు.రానున్న ఎన్నికల్లో పార్టీ నిలబెట్టే అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని కోరారు.రాబోయే రోజుల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఖచ్చితంగా పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందన్నారు.పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో విజయానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి. శ్రమించిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ ప్రెసిడెంట్ ధనుంజయ, సరికొండ వెంకటేష్,సోమ శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకుళ్లు, కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలనే లక్ష్యం

- **రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, శ్రీనివాస్ రెడ్డి**
- **ఫ్యూచర్ సిటీ తెలంగాణకే కాదు దేశానికే తలమానిక**
- **వచ్చే నెలలో ఫ్యూచర్ సిటీ కార్యాలయ భవనం ప్రారంభం.?**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్మిస్తున్న "ఫ్యూచర్ సిటీ" పనులను, రాష్ట్ర ఐటీ, రెవెన్యూ హౌసింగ్ శాఖల మంత్రులు, కార్యాలయ భవనాన్ని సందర్శించి పనులను సమీక్షించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్పేట్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ పనులను, రాష్ట్ర ఐటీ పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి, ప్రాజెక్టు పరిధిలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (FCDA) కార్యాలయ భవనాన్ని సందర్శించి జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా, జూన్ 2 లేదా 3 తేదీల్లో నిర్వహించే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమానికి ముందుగా పనుల పురోగతిని పరిశీలించేందుకు తాము వచ్చామని పేర్కొన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును భవిష్యత్తులో ప్రపంచస్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇక్కడ తీసుకునే ప్రతి నిర్ణయం, ప్రతి కార్యాచరణ గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా స్పష్టమైన దృక్పథంతో పనిచేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం వేస్తున్న పునాదులపై రాబోయే రోజుల్లో ఆధునిక నిర్మాణాలు వెలిసేలా చర్యలు తీసుకుంటున్నామని, తమ ప్రభుత్వ హయాంలోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే నగరంగా ఫ్యూచర్ సిటీ ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ ఏర్పాటుతో పాటు, గ్లోబల్ ప్రెజెన్స్ కలిగిన ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఇక్కడి నుంచే నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. యువత నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక చట్టం ద్వారా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి కట్టుబడి పని చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎదురైన ఆటుపోట్లు అధిగమిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ తెలంగాణకే కాక దేశానికే తలమానికంగా నిలిచే ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోందని, ఈ ప్రాజెక్ట్ ద్వారా లక్షలాది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగ భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు, రాష్ట్రాలు సైతం ఆలోచించని విధంగా రాష్ట్ర అభివృద్ధి కోసం వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్‌లో కొనసాగుతున్న యూనివర్సిటీకి శాశ్వత క్యాంపస్ నిర్మాణం వేగంగా జరుగుతోందని, పనుల పురోగతిని సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకుని నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రులు "యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ" నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంక, ఐఏఎస్, మహేశ్వరం డీసీపీ కె.నారాయణ రెడ్డి ఐపీఎస్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## మిస్సెస్ ఇండియా అవార్డు గెలుపొందిన ఆశా దీపికకు ఘనంగా స్వాగతం

**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మిస్సెస్ ఇండియా అవార్డు గెలుపొందిన ఆశా దీపికకు గురువారం శంషాబాద్ విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. బెంగళూరులోని పెదర్ లైట్ హోటల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన 30 మంది మోడల్స్ మూడు రోజులపాటు జరిగిన పోటీలో మిస్సెస్ ఇండియా కాస్మూస్క్ ఆర్గనైజేషన్ లో ఈ పోటీలు జరిగినట్లు తెలిపారు. మిస్సెస్ వరల్డ్ పోటీలకు వచ్చే సెప్టెంబర్ లో వెళ్లబోతున్నట్టు ఆమె తెలిపింది. యూనిటీ వరల్డ్ అండ్ ఆర్గనైజేషన్ లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ఆర్గనైజ్ చేస్తున్నాను అన్నారు. నేషనల్ లెవెల్ లో ఇండియాను రిప్రెజెంట్ చేస్తున్నట్టు తెలిపారు. నాకు చాలా ఆలోచనలు ఉన్నాయి అన్ని ప్రభుత్వాలలో పనిచేయాలన్నది తన కోరిక ప్రపంచంలో భారతదేశానికి ఉత్తమమైన ప్రాధాన్యత లభించే విధంగా తాను పనిచేయాలనుకున్నట్టు వెల్లడించారు. టెక్నాలజీలో తను మామూలు పర్సన్ నితాను పుట్టింది తెనాలిలో కానీ పెరిగింది హైదరాబాదులోనే తాను పక్క హైదరాబాదునని ప్రస్తుతం యుఎస్ లో ఉంటూ తన కెరియర్ యూఎస్ లోనే గడిచిందని మోడలింగ్ చేయడానికి భారతదేశానికి వచ్చినట్టు తెలిపారు.



## సీఎం సహాయ నిధిని పేదలు సద్వినియోగం చేసుకోవాలి

- **కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మార సురేష్**

**ఇబ్రహీంపట్నం మహా**:ఆరుట్లలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షకార్యదర్శులు నూకం బాలరాజు చిందం శ్రీశైలంల, మార సురేష్ ఆధ్వర్యంలో లబ్దిదారుని ఇంటికెళ్లి ఎల్ఓసి అందజేశారు.. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని సీఎం సహాయనిదిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మార సురేష్ అన్నారు. మంచాల మండలం, ఆరుట్ల గ్రామానికి చెందిన గోగిరెడ్డి ప్రేమలతకు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన రూ.75000 రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసిని ఆరుట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు నూకం బాలరాజు, చిందం శ్రీశైలంల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్దిదారుని ఇంటికెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుక బడిన ప్రజలందరికీ కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా వైద్య సదుపాయం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం సహాయ నిధిని ఏర్పాటు చేసిందని తెలిపారు. రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకి ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని.. ప్రజలందరూ క్షేమంగా ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎండి ఇమ్రాన్, సీనియర్ నాయకులు మాధగోని జంగయ్య గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నర్సింహా, బుట్టి కృష్ణ, మార లక్ష్మణ్, కంబాలపల్లి బుగ్గరాములు, కోరె బాబు, ఆరుట్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగల పరమేష్, దాసరమోని అశోక్, భాస్కర్, రైనా, ఆమంచ జగన్ తదితరులు పాల్గొన్నారు.

## జపాన్‌కు భారత మామిడి
# ఎగుమతులకు బ్రేక్



- తాజా మామిడి దిగుమతులు నిలిపివేసిన జపాన్
- ఫైటోసానిటరీ నిబంధనల ఉల్లంఘనలే కారణమన్న నివేదికలు
- ఎగుమతిదారులకు ఎయిర్ ఫ్రైట్ చార్జీలు కూడా భారంగా మారిన పరిస్థితి

న్యూఢిల్లీ: భారత మామిడి ఎగుమతులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రస్తుత సీజన్‌కు భారత నుంచి తాజా మామిడి దిగుమతులను జపాన్ నిలిపివేసినట్లు సమాచారం. దీంతో కేశర్, అల్ఫాన్సో, లంగ్రా, బంగినపల్లి వంటి భారతీయ మామిడి రకాల ఎగుమతులు ప్రభావితమయ్యాయి.

202526 ఆర్థిక సంవత్సరంలో జపాన్‌కు జరిగిన మామిడి ఎగుమతుల్లో గుజరాత్‌కు చెందిన కేశర్ మామిడి ప్రధాన వాటాను కలిగి ఉంది. జపాన్‌కు తాజా, ప్రాసెస్డ్ మామిడి ఎగుమతుల ద్వారా వచ్చిన మొత్తం 1.54 మిలియన్ డాలర్లలో దాదాపు 0.2 మిలియన్ డాలర్ల విలువైన కేశర్ మామిడిని ఎగుమతి చేశారు.మార్చిలో భారతీయ ట్రీట్మెంట్ సెంటర్లలో నిర్వహించిన తనిఖీల్లో ఫ్యూమిగేషన్, ఇతర క్రిమిసంహార ప్రక్రియల్లో లోపాలను జపాన్ ప్లాంట్ క్వారంటైన్ అధికారులు గుర్తించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. దీంతో మార్చి 25, 2026 తర్వాత భారత్‌లో జారీ చేసిన తనిఖీ సర్టిఫికెట్లతో వచ్చే మామిడి సరుకులను క్లియర్ చేయబోమని జపాన్ అధికారులు ప్రకటించినట్లు సమాచారం.జపాన్‌కు మామిడి ఎగుమతులకు వ్యవసాయ మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైన్ అండ్ స్టోరేజ్ నుంచి ఫైటోసానిటరీ సర్టిఫికేట్ తప్పనిసరి. భారత అధికారులు, జపాన్ అధికారుల మధ్య ఈ అంశంపై చర్చలు కొనసాగుతున్నట్లు ఎగుమతిదారులు చెబుతున్నారు.ఇక ఎయిర్ ఫ్రైట్ చార్జీలు కూడా ఎగుమతిదారులకు మరో సవాలుగా మారాయి. గతేడాది కిలోకు రూ.250350 మధ్య ఉన్న రవాణా ఖర్చులు ఈసారి రూ.580590 వరకు పెరిగినట్లు ఎగుమతిదారులు చెబుతున్నారు. పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలు, విమాన ఇంధన ధరల పెరుగుదల, ఎయిర్‌లైన్ రూట్ల మార్పులు ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు.అమెరికా మార్కెట్ ఇప్పటికీ భారత మామిడి ఎగుమతులకు ప్రధాన గమ్యస్థానంగా ఉండగా, ఎయిర్‌లైన్లు ఔషధ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడంతో మామిడి సరుకులు తరచుగా ఆఫ్‌లోడ్ అవుతున్నాయని ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





# గిఫ్ట్ నిఫ్టీకి భారీ షాక్

- 2 శాతం కుప్పకూలిన గిఫ్ట్ నిఫ్టీ ఫ్యూచర్స్
- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో మార్కెట్లలో భయాందోళనలు
- శుక్రవారం స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ప్రారంభమయ్యే సూచనలు

**ముంబై, మే 28:** అమెరికాఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మరింత తీవ్రమవడంతో గిఫ్ట్ నిఫ్టీ ఫ్యూచర్స్ గురువారం భారీగా పతనమయ్యాయి. దాదాపు 2 శాతం పడిపోయి 23,580 స్థాయికి చేరడంతో భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలతో ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బక్రీద్ సెలవు కారణంగా గురువారం దేశీయ మార్కెట్లు మూతపడ్డాయి.అమెరికా బలగాలు ఇరాన్ సైనిక స్థావరాలపై దాడులు జరపడం, దీనికి ప్రతిగా ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ అమెరికా ఎయిర్‌బేస్‌పై దాడి చేసినట్లు సమాచారం రావడంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళనలు పెరిగాయి. గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా మిత్రదేశం కువైట్ పై కూడా క్షిపణులు, డ్రోన్ దాడులు జరిగినట్లు నివేదికలు వెల్లడించాయి.
పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగిశాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 3 శాతానికి పైగా పెరిగి 97.29 డాలర్లకు చేరగా,



వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (WTI) ధర 91.71 డాలర్లకు చేరింది.భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం ఆసియా మార్కెట్లపైనా కనిపించింది. హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్ 1.42 శాతం, దక్షిణ కొరియా కోస్పీ 1.01 శాతం, జపాన్ నిక్కీ 225 సూచీలు 0.62 శాతం మేర నష్టపోయాయి.ముడి చమురు ధరల పెరుగుదల, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఆసియా మార్కెట్ల బలహీనత కారణంగా పెట్టుబడిదారుల్లో ఆందోళనలు పెరిగి మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# ఒమన్‌ను పేల్చేస్తాం!

- మిత్రదేశంపై ట్రంప్ సంచలన హెచ్చరిక.
- అంతర్జాతీయ జలమార్గం హోర్ముజ్ పై ఆధిపత్యం చెలాయిస్తే సహించేది లేదు.
- ఇరాన్ సైనిక స్థావరాలపై మరోసారి అమెరికా వైమానిక దాడులు



**వాషింగ్టన్, మహా :** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య రగులుతున్న యుద్ధం మరింత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. గత మూడు నెలలుగా ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పుడు పశ్చిమాసియా భద్రతను, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై ప్రారంభించిన దాడులు తీవ్రతరమవుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్‌తో చేతులు కలిపి తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే.. దశాబ్దాల కాలంగా తమకు అత్యంత సన్నిహిత మిత్రదేశంగా ఉన్న 'ఒమన్' దేశాన్ని సైతం బాంబులతో పేల్చేస్తామని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. వైట్ హౌస్‌లో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయంగా పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.అసలు వివాదం ఎక్కడ మొదలైందంటే.. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతానికి పైగా వాణిజ్యం హోర్ముజ్ జలసంధి గుండానే జరుగుతుంది. అయితే, అమెరికాఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఈ మార్గంలో వాణిజ్యం దాదాపుగా నిలిచిపోయింది. ఈ తరుణంలో ఇరాన్ ఒక కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే వాణిజ్య నౌకల రవాణాను నియంత్రించేలా లేదా టోల్ వసూలు చేసేలా ఇరాన్, ఒమన్ దేశాలు ఉమ్మడిగా ఒక ఒప్పందం కుదుర్చుకోబోతున్నాయంటూ ఇరాన్ ప్రభుత్వ మీడియా సంచలన ప్రకటన చేసింది. ఈ వార్తలపై డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. "హోర్ముజ్ అనేది అంతర్జాతీయ జలమార్గం. దానిపై పెత్తనం చెలాయించడానికి లేదా నియంత్రించడానికి ఎవరికీ హక్కు లేదు. ఒమన్ అందరిలాగే బుద్ధిగా ప్రవర్తించాలి. అలా కాకుండా ఇరాన్‌తో చేతులు కలిపితే మాత్రం ఆ దేశాన్ని పేల్చేయాల్సి వస్తుంది" అని ఆయన బహిరంగంగానే హెచ్చరించారు.అమెరికాకు దశాబ్దాలుగా నమ్మకమైన మిత్రదేశంగా, ఇరు దేశాల మధ్య శాంతి చర్చల్లో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఒమన్ పై ట్రంప్ ఇలాంటి తీవ్ర వ్యాఖ్యలు చేయడం దౌత్య వర్గాలను విస్మయానికి గురిచేసింది. 1790వ సంవత్సరం నుండి అమెరికా, ఒమన్ మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. అమెరికా నౌకాదళానికి ఒమన్‌లోని దుక్మ్ పోర్టులో సైనిక ప్రవేశం కూడా ఉంది. అయినప్పటికీ కేవలం వాణిజ్యపరమైన ఆధిపత్యం కోసం ఒక సార్వభౌమ దేశాన్ని నామరూపాల్లేకుండా చేస్తామంటూ ట్రంప్ బెదిరించడాన్ని అంతర్జాతీయ విశ్లేషకులు 'గన్‌బోట్ డిప్లొమసీ'గా అభివర్ణిస్తూ తీవ్రంగా తప్పుబడుతున్నారు. బహుశా ట్రంప్ పొరపాటున ఇరాన్ అనబోయి ఒమన్ అన్నారేమోనని వైట్ హౌస్ వర్గాల్లో తొలుత చర్చ జరిగినప్పటికీ, అమెరికా విదేశాంగ శాఖ అధికారికంగా విడుదల చేసిన ట్రాన్స్క్రిప్ట్‌లోనూ 'ఒమన్' అనే ఉండటంతో ఆయన ఉద్దేశపూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేసినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి.
మరోవైపు హోర్ముజ్ జలసంధి సమీపంలో ఇరాన్ సైనిక స్థావరాలే లక్ష్యంగా అమెరికా బలగాలు బాంబుల వర్షం కురిపించాయి. అక్కడ ఉన్న డ్రోన్ కంట్రోల్ సెంటర్లను నేలమట్టం చేయడంతో పాటు పలు ఇరానియన్ డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. ఒక అమెరికా వాణిజ్య నౌకను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ నాలుగు డ్రోన్లను ప్రయోగించిందని, వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నామని అమెరికా రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో ఇరాన్ మరింత దారుణమైన దాడులకు పాల్పడకముందే, ముందస్తు ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే ఈ ఆపరేషన్ చేపట్టామని అమెరికా సైన్యం సమర్థించుకుంది. కానీ, ఈ చర్యల ద్వారా అమెరికా ఉద్దేశపూర్వకంగానే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఇరాన్ తీవ్రంగా మండిపడింది.పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, ప్రధాని అభ్యర్థన మేరకు తాము ఇరాన్‌కు శాంతి చర్చల కోసం ఒక చిన్న అవకాశం ఇచ్చామని, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే పూర్తిగా పతనమైందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ పరిణామాలన్నీ మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తాయా అన్న భయాందోళనలు ప్రస్తుతం సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద రగులుతున్న ఈ చిన్న నిప్పురవ్వ.. ఏ క్షణమైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దహించివేసే దావానలంగా మారే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయమని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# బెంగాల్‌లో చొరబాట్లకు చెక్

- స్వచ్ఛందంగా వెళ్లకపోతే బలవంతంగానైనా పంపిస్తాం.
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు

కోల్‌కతా,మహా : పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లో గత కొన్నేళ్లుగా దేశ భద్రతకు పెను సవాలుగా మారిన అక్రమ వలసలు, చొరబాట్ల వ్యవహారంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. బెంగాల్‌లో మారుతున్న క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆయన తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు నిత్యం సరిహద్దులు దాటి చొరబాట్లు జరిగే రాష్ట్రంలో, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యల వల్ల వలసదారులు తమంతట తామే వెనక్కి వెళ్లిపోతున్నారని వెల్లడించారు. దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారు స్వచ్ఛందంగా తమ దేశాలకు తిరిగి వెళ్తే వారిపై ఎలాంటి చట్టపరమైన కేసులు ఉండవని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, ఈ అవకాశాన్ని వాడుకోకుండా స్వచ్ఛందంగా వెళ్లని వారిని మాత్రం భవిష్యత్తులో చట్టప్రకారం బలవంతంగానైనా వెనక్కి పంపిస్తామని



అమిత్ షా గట్టి హెచ్చరికలు జారీ చేశారు.
పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పాలనపై కేంద్ర హోంమంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వాల ఓటు బ్యాంకు రాజకీయాల వల్లే బెంగాల్ సరిహద్దుల్లో యథేచ్ఛగా చొరబాట్లు జరిగాయని, దేశ భద్రతను పణంగా పెట్టి అక్రమ వలసదారులను ప్రోత్సహించారని ఆరోపించారు. అయితే, కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరిహద్దు రక్షణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని చెప్పారు. సరిహద్దుల భద్రతను పటిష్టం చేసేందుకు వీలుగా, కేవలం 7 రోజుల వ్యవధిలోనే సరిహద్దు భద్రతా దళానికి మౌలిక వసతుల కల్పన కోసం 600 హెక్టార్ల భూమిని అప్పగించామని ఈ సందర్భంగా అమిత్ షా వెల్లడించారు. ఈ భూమి లభ్యతతో భారత్‌బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫెన్సింగ్ (రక్షణ కంచె) పనులకు ఉన్న అన్ని రకాల సాంకేతిక, పరిపాలనాపరమైన అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయని హోంమంత్రి స్పష్టం చేశారు. సరిహద్దుల్లో ఫెన్సింగ్ పనులు శరవేగంగా పూర్తి కాబోతున్నాయని, అలాగే అత్యాధునిక నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సరిహద్దు రక్షణ వ్యవస్థలు బలోపేతం కావడం వల్లే ఇప్పుడు అక్రమ రవాణా, దొంగచాటు చొరబాట్లు దాదాపుగా అదుపులోకి వచ్చాయని తెలిపారు. దేశ సార్వభౌమత్వాన్ని, అంతర్గత భద్రతను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని, బెంగాల్ భూభాగంపై అక్రమ చొరబాట్లను పూర్తిగా నిర్మూలించే వరకు ఈ కఠిన విధానం కొనసాగుతుందని అమిత్ షా పునరుద్ఘాటించారు.



# మమతా బెనర్జీకి మరో భారీ షాక్

- అధికార ప్రతినిధి శంతను సేన్ రాజీనామా
- కకోలి దస్తీదార్ రాజీనామా చేసిన మరుసటి రోజే షాకిచ్చిన శంతను

**కోల్ కత్తా, మహా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవం పాలైన అనంతరం మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నాయకులు వరుసగా రాజీనామా చేస్తున్నారు. తాజాగా సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ శంతను సేన్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేశారు. నిన్న కకోలీ దస్తీదార్ ఘోష్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవులకు రాజీనామా చేశారు. ఈ రాజీనామా మరుసటి రోజే శంతను సేన్ షాకిచ్చారు. 2024 నాటి ఆర్జీకర్ హత్యాచార కేసు, పార్టీపై వస్తున్న నిరంతర అవినీతి ఆరోపణలతో తాను తీవ్ర మనస్తాపం చెంది ఈ నిర్ణయం తీసుకున్నానని శంతను సేన్ పేర్కొన్నారు. పార్టీ అధికార ప్రతినిధిగా తన పాత్రను నిర్వర్తించే స్థితిలో లేనని తెలిపారు. వివిధ సమయాల్లో తాను పార్టీ నిర్ణయాలతో ఏకీభవించలేదని, అనేక వివాదాస్పద అంశాలపై తాను బహిరంగంగానే ప్రశ్నించానని ఆయన పేర్కొన్నారు. అందుకే ప్రజలు తనను వివిధ సందర్భాలలో ఎంతగానో ప్రశంసించారని పేర్కొన్నారు. ఆర్జీకర్ కేసు, నిరుద్యోగం, అవినీతి సహా వివిధ అంశాల కారణంగా ప్రజలు తమను ఓడించారని, అందుకే అధికార ప్రతినిధిగా మాట్లాడటానికి తన మనసు అంగీకరించడం లేదని పేర్కొన్నారు

# ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాల్సిందే

**రాహుల్ గాంధీ ధ్వజం.**

ఢిల్లీ, మహా : దేశంలో వైద్య విద్య ప్రవేశాల పరీక్ష 'నీట్ యూజీ' ఫలితాలపై వెల్లువెత్తుతున్న తీవ్ర వివాదం, పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి తక్షణమే రాజీనామా చేయాలని, లేదా ప్రధాని ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పరీక్షలు రాసిన 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ఈ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టేసిందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజధానిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను, ఎన్‌టీఏ తీరును ఎండగట్టారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు జరిగిన అన్యాయంపై తాము రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.
దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎగ్జామినేషన్ వ్యవస్థను ఈ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒకవైపు పరీక్షల్లో అవకతవకలు జరిగాయని దేశమంతా కోడైకూస్తున్నా, గుజరాత్, బీహార్, హర్యానా వంటి రాష్ట్రాల్లో పేపర్ లీక్ ముఠాలు అరెస్ట్ అవుతున్నా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాత్రం ఏమీ జరగనట్లే కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులు రేయింబగళ్లు కష్టపడి చదివితే, ధనబలం ఉన్న కొందరు అక్రమార్కులు పేపర్లను ముందే కొనుగోలు చేసి ర్యాంకులు సాధిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. "ఇది కేవలం ఒక పరీక్షకు సంబంధించిన సమస్య కాదు.. లక్షలాది మంది విద్యార్థుల కన్నీళ్లు, వారి తల్లిదండ్రుల జీవితకాల శ్రమను హరించడమే" అని ఆవేదన వ్యక్తం చేశారు.
తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకు ప్రతిపక్షాలపై



బురదజల్లే రాజకీయాలకు కేంద్ర ప్రభుత్వం తెరతీసిందని, అయితే నన్ను ఎంత విమర్శించినా, ఎన్ని రకాలుగా వేధించినా కేంద్రం చేసిన తప్పులను దాచలేరని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. విద్యా వ్యవస్థను కాషాయీకరణ చేసే క్రమంలో భాగంగానే అసమర్థులను కీలక పీఠాలపై కూర్చోబెట్టారని, దీని ఫలితంగానే వరుసగా పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దులు జరుగుతున్నాయని విమర్శించారు. విద్యా శాఖకు నాయకత్వం వహించే అర్హత ధర్మేంద్ర ప్రధాన్‌కు లేదని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఆయన వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు.
దేశ భవిష్యత్తును నిర్దేశించే 18.5 లక్షల మంది విద్యార్థుల పక్షాన తాము నిలబడతామని, పార్లమెంట్ లోపలా, వెలుపలా ఈ అన్యాయంపై గట్టిగా ప్రశ్నిస్తామని రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఈ నీట్ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన ఎంతటివారినైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, ఎన్‌టీఏ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ ఈ పోరాటాన్ని ఆపబోదని స్పష్టం చేశారు.

# నాలుగు రాష్ట్రాలకు బీజేపీ కొత్త అధ్యక్షులు

- నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నితిన్ నబిన్
- ఢిల్లీ, పంజాబ్, హర్యానా, త్రిపురాలకు కొత్త సారథులు
- వచ్చే ఏడాది ఎన్నికలు జరుగనున్న పంజాబ్ పై వ్యూహాత్మక దృష్టి




**ఇంటర్నెట్ డెస్క్, మహా :** ఇటీవలే పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరి ఎన్నికలలో విజయం సాధించిన బీజేపీ ఇప్పుడు మిగతా రాష్ట్రాలపై దృష్టి సారిస్తోంది. నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల్ని నియమిస్తూ గురువారం బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వచ్చే ఏడాది ఎన్నికలు జరుగనున్న పంజాబ్ కు కొత్త అధ్యక్షుడిని నియమించారు. దీని ప్రకారం ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా హర్ష్ మల్హోత్రాను, పంజాబ్ బీజేపీ అధ్యక్షుడిగా కేవల్ సింగ్ ధిల్లాన్‌ను, హరియానా బీజేపీ అధ్యక్షురాలిగా అర్చనా గుప్తాను, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్ దేవ్‌రాయ్‌ను నియమించారు. ఇంతకుముందు ఢిల్లీ అధ్యక్షుడిగా వీరేంద్ర సచ్‌దేవా, పంజాబ్ అధ్యక్షుడిగా సునీల్ ఝకార్, హరియాణా అధ్యక్షుడిగా మోహన్ లాల్ బదోలి, త్రిపుర అధ్యక్షుడిగా రజీబ్ భట్టాచార్జీ ఉండేవారు.పంజాబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన కేవల్ సింగ్ ధిల్లాన్ గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. అంతకుముందు కాంగ్రెస్‌లో ఉండేవారు. తర్వాత పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అలాగే, పంజాబ్ మాజీ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్‌కు సన్నిహితుడు. ఉగ్రవాద కార్యకలాపాలు తీవ్రంగా ఉన్న సమయాల్లో పంజాబ్‌కు 'పెప్సీ'ని తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన పారిశ్రామికవేత్త, రాజకీయ నాయకుడు ధిల్లాన్. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా నియామకమైన హర్ష్ మల్హోత్రా తొలిసారి ఎంపీగా గెలిచారు. ఆయన పార్టీ కోసం చాలా శ్రమించారు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. హరియాణా అధ్యక్షురాలిగా ఎంపికైన అర్చనా గుప్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. త్రిపురలో అత్యంత కీలక నియోజకవర్గమైన మతార్బారి నుంచి అభిషేక్ దేవరాయ్ పోటీ చేసి గెలిచారు. ఆయనకు తాజాగా అధ్యక్షుడిగా పదవి దక్కింది. 2027 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పంజాబ్‌లో ఒక సిక్కు ముఖాన్ని ప్రముఖంగా చూపించే వ్యూహాత్మక ఎత్తుగడలో భాగంగా బీజేపి కీలక నిర్ణయం తీసుకుంది. 2027 ఎన్నికల దిశగా పయనిస్తున్న పంజాబ్ బీజేపీ, కేవల్ సింగ్ ధిల్లాన్ నాయకత్వంలో ఎటువంటి కొత్త వ్యూహాలను అవలంబిస్తుందో వేచి చూడాలి. ధిల్లాన్ నియామకం అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి (ఆప్) పంపిన ఒక వ్యూహాత్మక రాజకీయ సంకేతంగా కూడా పరిగణిస్తున్నారు. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సొంత నియోజకవర్గమైన సంగ్రూర్ జిల్లాకు చెందిన ప్రముఖ నాయకుడైన ధిల్లాన్‌ను, పంజాబ్ రాజకీయాలను శాసించే 'గ్రామీణ మాల్వా' ప్రాంతంలో తన పట్టు పెంచుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తున్న కీలక సమయంలో ఎంపిక చేయడం విశేషం. శిరోమణి అకాలీదళ్‌తో పొత్తు విచ్ఛిన్నమైన తర్వాత, పంజాబ్‌లో కేవలం పట్టణ ప్రాంత హిందూ ఓటర్లకే పరిమితమైన పార్టీగా ఉన్న ముద్రను తొలగించుకోవడానికి బీజేపీ తీవ్రంగా శ్రమిస్తోంది. మాల్వా ప్రాంతంలో బలమైన మూలాలు కలిగి, కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఒక 'జాట్ సిక్కు' నాయకుడిని నియమించడం ద్వారా, రాష్ట్రంలో ఒక విస్తృత సామాజిక ముఖాన్ని ఆవిష్కరించడానికి పార్టీ ప్రయత్నిస్తోంది. కాగా, హర్యానాలో 43 ఏళ్ల తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన రెండో మహిళ డాక్టర్ గుప్తా. అంతకుముందు, 1980 నుండి 1983 వరకు డాక్టర్ కమలా వర్మ రాష్ట్ర అధ్యక్షురాలిగా వ్యవహరించారు. పానిపట్‌లోని సమల్ఖాలో జన్మించిన డాక్టర్ అర్చనా గుప్తా, ఇక్కడే ఒక డయాగ్నస్టిక్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అట్టా గ్రామానికి చెందిన ఆమె తాతయ్య లాలా సూరజ్ భాన్ ఒక స్వాతంత్ర్య సమరయోధుడు.ఆమె ఎంబిబిఎస్, రేడియాలజీలో ఎండి పూర్తి చేశారు. ఆమె విశ్వహిందూ పరిషత్‌లో చేరి, పానిపట్ నుండి "ఇండియన్ హెల్త్ లైన్"ను ప్రారంభించారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆమె బీజేపీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొనడం ప్రారంభించారు.

## నెల రోజుల నాన్‌స్టాప్
# యాక్షన్ షెడ్యూల్!


సూపర్‌స్టార్ మహేష్ బాబు దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం *'వారణాసి'*పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అనౌన్స్‌మెంట్ నుంచే సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ సినిమా ఇండియన్ సినిమా చరిత్రలోనే అతిపెద్ద యాక్షన్ అడ్వెంచర్‌గా రూపుదిద్దుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే ప్రయత్నంలో రాజమౌళి ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.

తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమా కోసం చిత్ర యూనిట్ భారీ యాక్షన్ షెడ్యూల్‌ను సిద్ధం చేసింది. దాదాపు నెల రోజుల పాటు ఎలాంటి విరామం లేకుండా యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లో పూర్తిగా హైవోల్టేజ్ ఫైట్ సీక్వెన్స్‌లకే ప్రాధాన్యం ఇవ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. అంతర్జాతీయ స్థాయి స్టంట్ మాస్టర్స్ పర్యవేక్షణలో ఈ యాక్షన్ ఘట్టాలు తెరకెక్కనున్నట్లు సమాచారం. ఈ భారీ యాక్షన్ షెడ్యూల్‌లో మహేష్ బాబు పూర్తి స్థాయి యాక్షన్ మోడ్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. గత చిత్రాలతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా.. అత్యంత కఠినమైన, రా అండ్ రగ్గడ్ ఫైట్ సీక్వెన్స్‌లలో ఆయన పాల్గొననున్నట్లు సమాచారం. హీరో పాత్రను మరింత పవర్‌ఫుల్‌గా ఎలివేట్ చేసేలా యాక్షన్ డిజైన్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ అడ్వెంచరస్ పాత్ర కోసం మహేష్ ఇప్పటికే జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్‌లో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. ట్రెక్కింగ్‌తో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఫిజికల్ ట్రైనింగ్ పూర్తి చేసినట్లు సమాచారం. తొలి దశ శిక్షణ ఇప్పటికే పూర్తికాగా.. ప్రస్తుతం రెండో దశ ట్రైనింగ్ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ శిక్షణ పూర్తయ్యాక మహేష్ నేరుగా యాక్షన్ సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారని సమాచారం. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రాజమౌళి.. 'వారణాసి'ను మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. కంప్యూటర్ గ్రాఫిక్స్‌పై మాత్రమే ఆధారపడకుండా.. రియలిస్టిక్ యాక్షన్‌కు ప్రాధాన్యత ఇస్తూ ఈ భారీ షెడ్యూల్‌ను ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ యాక్షన్ సన్నివేశాలన్నీ హీరో పాత్రను పీక్స్‌లో ఎలివేట్ చేసేలా రూపొందిస్తున్నట్లు ఫిలింనగర్ వర్గాల్లో చర్చ సాగుతోంది.




# రామ్‌చరణ్‌పై ట్రోల్స్‌కు సీనియర్ నటుడు కౌంటర్..
## "నెగిటివిటీ వెనుక శాడిజమే కనిపిస్తోంది!"

ప్రస్తుత డిజిటల్ యుగంలో సెలబ్రిటీలపై సోషల్ మీడియాలో పెరుగుతున్న ట్రోలింగ్, నెగిటివ్ ప్రచారాలపై ఓ ప్రముఖ సీనియర్ నటుడు ఘాటుగా స్పందించారు. ఇటీవల ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌పై జరుగుతున్న ఆన్‌లైన్ ట్రోలింగ్ అంశంపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. తనకు, తన కుటుంబానికి రామ్‌చరణ్ అంటే వ్యక్తిగతంగా ఎంతో అభిమానమని పేర్కొన్న సదరు నటుడు.. చరణ్‌లాంటి అంకితభావం కలిగిన నటుడిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం నెగిటివిటీని వ్యాప్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుని చేసే ట్రోలింగ్‌ను ఆయన తీవ్రంగా ఖండించారు. సినిమా రంగం వెనుక ఉండే అసలు ఒత్తిడిని చాలామంది అర్థం చేసుకోలేరని ఆయన వ్యాఖ్యానించారు. షూటింగ్ పూర్తయ్యాక హీరోలు ప్రశాంతంగా ఉంటారని చాలా మంది భావిస్తారని.. కానీ వాస్తవం పూర్తిగా భిన్నమని చెప్పారు. రిలీజ్ డేట్లు, సెన్సార్ ప్రక్రియలు, నిర్మాతల ఆర్థిక భద్రత వంటి అనేక బాధ్యతలు ఒక స్టార్ హీరో భుజాలపై ఉంటాయని వెల్లడించారు. ఇలాంటి మానసిక ఒత్తిడిలో మాట్లాడే సమయంలో చిన్న పొరపాట్లు జరగడం సహజమని పేర్కొన్న ఆయన.. వాటినే పట్టుకుని నెగిటివిటీ వ్యాప్తి చేయాలనుకునే ధోరణిపై మండిపడ్డారు. అలాంటి ప్రవర్తనలో శాడిజం, పర్వర్షన్ స్పష్టంగా కనిపిస్తోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అయితే రామ్‌చరణ్ మానసికంగా చాలా దృఢమైన వ్యక్తి అని, ఇలాంటి ట్రోలింగ్‌ను ఆయన అస్సలు పట్టించుకోరని సీనియర్ నటుడు వెల్లడించారు. ఎవరో ఒకరిని కిందికి లాగి తమ ఉనికిని చాటుకోవాలనుకునే వారే ఎక్కువగా ఇలా వ్యవహరిస్తారని వ్యాఖ్యానించారు. ట్రోలింగ్ సంస్కృతి ఎంత పెరిగినా.. కష్టపడి పనిచేసే వారి శ్రమ ఎప్పటికీ వృథా కాదని, చివరికి ప్రతిభ, కష్టం మాత్రమే నిలుస్తాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.






## 'లెజెండ్' శరవణన్ స్పై అవతార్..
# ఓటీటీలోకి వచ్చిన 'లీడర్'పై మళ్లీ చర్చ!

వ్యాపార ప్రకటనలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న 'ది లెజెండ్' శరవణన్.. ఇప్పుడు సినిమాల్లో కూడా తనదైన ముద్ర వేయాలని ప్రయత్నిస్తున్నారు. తొలి చిత్రం *'ది లెజెండ్'*తో భారీ ఎంట్రీ ఇచ్చిన ఆయన.. ఇప్పుడు మరింత స్టైలిష్, మరింత యాక్షన్ ప్యాక్డ్ అవతార్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'లీడర్' సినిమా తాజాగా ఓటీటీలోకి రావడంతో సోషల్ మీడియాలో మళ్లీ చర్చ మొదలైంది. సాధారణ మెకానిక్‌గా కనిపించే వ్యక్తి వెనుక దేశ రక్షణకు సంబంధించిన సీక్రెట్ మిషన్ దాగి ఉంటే? అనే ఆసక్తికర కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం యాక్షన్, థ్రిల్ అంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. 'ఎదిర్ నీచల్', 'కొడి' వంటి చిత్రాలతో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆర్.ఎస్. దురై సెంథిల్‌కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మొదటి సినిమాతో పోలిస్తే శరవణన్ నటనలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలు, ఎమోషనల్ మూమెంట్స్‌లో ఆయన ఈసారి మరింత కాన్ఫిడెంట్‌గా కనిపిస్తున్నారని ప్రేక్షకులు చెబుతున్నారు. టాలీవుడ్ బోల్డ్ బ్యూటీ పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్‌గా నటించగా.. ఆండ్రియా జెరెమియా, షామ్, సంతోష్ ప్రతాప్ కీలక పాత్రలు పోషించారు. గిబ్రాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సినిమాకు మరో ప్లస్ పాయింట్‌గా నిలిచిందని కామెంట్లు వినిపిస్తున్నాయి. 2026 ఏప్రిల్ 3న గుడ్ ఫ్రైడే సందర్భంగా థియేటర్లలో విడుదలైన ఈ సినిమా.. తాజాగా మే 28 నుంచి ప్రైమ్ వీడియోలో డిజిటల్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో కూడా విడుదల కావడంతో దక్షిణాది ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. కథ విషయానికి వస్తే.. తూత్తుకుడి పోర్ట్ ప్రాంతంలో కార్ మెకానిక్‌గా పనిచేసే శక్తివేల్ అలియాస్ పొన్మారన్ జీవితం చుట్టూ సినిమా తిరుగుతుంది. భార్య మీరా, చిన్న కూతురితో సాధారణ జీవితం గడిపే అతను.. బయటకు చూస్తే సాధారణ వ్యక్తిలా కనిపిస్తాడు. అయితే పోర్ట్‌కు చేరిన ఓ అనుమానాస్పద కంటైనర్ దేశ భద్రతకు ముప్పుగా మారడంతో పరిస్థితులు మారిపోతాయి. అక్రమ రవాణా, అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్‌లు, దేశద్రోహ కార్యకలాపాల వెనుక ఉన్న పెద్ద కుట్రను ఛేదించేందుకు దర్యాప్తు మొదలవుతుంది. ఈ క్రమంలో శక్తివేల్ కూడా ప్రమాదకర ఆటలోకి లాగబడతాడు. అక్కడి నుంచే కథలో అసలు ట్విస్ట్ మొదలవుతుంది. అందరూ సాధారణ మెకానిక్ అనుకున్న శక్తివేల్‌కు స్పై బ్యాక్‌గ్రౌండ్ ఉందని బయటపడటంతో కథ మరో మలుపు తిరుగుతుంది. గతంలో దేశ రక్షణ కోసం పనిచేసిన అతను.. మళ్లీ ఒక కీలక మిషన్‌లోకి ఎందుకు దిగాడు? దేశాన్ని ప్రమాదంలోకి నెట్టే కుట్రను ఎలా అడ్డుకున్నాడు? చివరకు ఎలా 'లీడర్'గా నిలిచాడు? అన్నదే ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ అసలు కథ.

# ముంబై బాట పట్టిన బాలయ్య..

నటసింహం నందమూరి బాలకృష్ణ హీరోగా, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఎన్‌బీకే 111పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరసింహారెడ్డి తర్వాత వీరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా.. తాజా షెడ్యూల్ కోసం మూవీ టీమ్ ముంబైకి వెళ్లినట్లు సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లో కీలక షెడ్యూల్ పూర్తి చేసిన చిత్ర యూనిట్.. ఇప్పుడు ముంబైలో లాంగ్ షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది. అక్కడ బాలకృష్ణపై పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌లు తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఈ సినిమాలో బాలయ్యను పూర్తి భిన్నమైన గ్యాంగ్‌స్టర్ లుక్‌లో చూపించనున్నారని తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ఆయనను పవర్‌ఫుల్ రాజు గెటప్‌లో చూపించడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది.


ఈ సినిమాలో మరో కీలక ఆకర్షణగా మంచు మనోజ్ నిలవనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆయన ఈ చిత్రంలో నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించగా.. పవర్‌ఫుల్ నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో బాలయ్యమనోజ్ కాంబినేషన్ సన్నివేశాలపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. హీరోయిన్‌గా కాజల్ అగర్వాల్ నటిస్తుండగా.. భగవంత్ కేసరి తర్వాత బాలయ్యతో ఆమెకు ఇది రెండో సినిమా. మొదట ఈ ప్రాజెక్ట్ కోసం నయనతార పేరు వినిపించినప్పటికీ.. కథలో మార్పుల నేపథ్యంలో చివరకు కాజల్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. సంగీత దర్శకుడు తమన్ ఈ సినిమాకు మ్యూజిక్ అందిస్తున్నారు. భారీ మాస్ బీట్స్, పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లేలా ఆయన పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట్ సతీష్ కిలారు ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇక బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా జూన్ 10న సినిమా నుంచి స్పెషల్ అప్డేట్ రానుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేస్తారా? లేక పవర్‌ఫుల్ టీజర్‌తో సర్ప్రైజ్ ఇస్తారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. యాక్షన్, ఎమోషన్, భారీ విజువల్స్‌తో రూపొందుతున్న NBK111 బాలయ్య కెరీర్‌లో మరో మాస్ బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుందనే అంచనాలు వినిపిస్తున్నాయి.



## ఫిట్‌నెస్‌తో మెరిసిన శోభితా రాణా..
# సెల్ఫీలో కాన్ఫిడెన్స్ షో!

బ్లాక్ అవుట్‌ఫిట్‌లో ఆకట్టుకున్న హీరోయిన్.. ఫిట్‌నెస్, సెల్ఫ్ లవ్‌కు ప్రతీకగా పోజ్ ఎనర్జీతో నిండిన మిర్రర్ సెల్ఫీలో నటి శోభితా రాణా తన ఫిట్‌నెస్, కాన్ఫిడెన్స్‌ను మరోసారి చూపించారు. బ్లాక్ కలర్ " జస్ట్ డూ ఇట్" క్రాప్ టాప్‌తో పాటు ట్రాక్ ప్యాంట్ ధరించి కనిపించిన ఆమె.. టోన్డ్ ఫిజిక్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. మెస్సీ బన్ హెయిర్ స్టైల్, చిరునవ్వు, గ్లోయింగ్ లుక్‌తో ఫిట్‌నెస్, స్ట్రెంగ్త్, సెల్ఫ్ లవ్‌కు ప్రతీకగా నిలిచారు. 1992 జూన్ 16న చండీగఢ్‌లో జన్మించిన శోభితా రాణా.. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి తర్వాత సినీ రంగంలోకి అడుగుపెట్టారు. మొదట పంజాబీ సినిమాల్లో గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. *'గోలు ఔర్ పప్పు' (2014)*తో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. అనంతరం 'ఇష్క్ బ్రాండీ' (2014), 'కెనడా ది ఫ్లైట్' (2016) చిత్రాలతో మంచి గుర్తింపు సంపాదించారు. పంజాబీ, హిందీ చిత్రాలతో పాటు తెలుగు ప్రేక్షకులకు కూడా శోభితా పరిచయమే. 'రంగ రంగ వైభవంగా' (2022), 'షాడో' వంటి చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులను అలరించారు.

ప్రస్తుతం శోభితా రాణా పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆమె నటిస్తున్న హిందీ డ్రామా చిత్రం 'ప్రిషతి' 2026 డిసెంబర్ 25న విడుదలకు సిద్ధమవుతుండగా.. మరిన్ని కొత్త ప్రాజెక్టులు కూడా లైన్లో ఉన్నట్లు సమాచారం.




# ఎల్లమ్మ హీరోయిన్ సస్పెన్స్..
## డీఎస్‌పీ సరసన మమితా బైజు ఫిక్స్ అవుతుందా?

'బలగం' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న తాజా ప్రాజెక్ట్ *'ఎల్లమ్మ'*పై ఇప్పటికే టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంతో రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ హీరోగా పరిచయం అవుతుండటంతో ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తి పెరిగింది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అయితే.. ఇప్పటికీ హీరోయిన్ ఎంపిక మాత్రం ఫైనల్ కాలేదనే చర్చ ఇండస్ట్రీలో కొనసాగుతోంది. గతంలో ఈ ప్రాజెక్ట్ కోసం పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించాయి. మొదట కీర్తి సురేష్ పేరు బలంగా వినిపించగా.. ఇటీవల మృణాల్ ఠాకూర్‌ను కూడా మేకర్స్ సంప్రదించినట్లు ప్రచారం జరిగింది. 'సీతారామం', 'హాయ్ నాన్న' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న మృణాల్.. ఈ ఎమోషనల్ పాత్రకు సరిగ్గా సరిపోతుందని భావించి చర్చలు జరిపినట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఈ ప్రెస్టేజియస్ ప్రాజెక్ట్‌లో యంగ్ సెన్సేషన్ మమితా బైజు పేరు బలంగా వినిపిస్తోంది. 'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ యంగ్ బ్యూటీ ప్రస్తుతం వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో 'ఎల్లమ్మ'లో హీరోయిన్ పాత్రకు మమితా బైజును తీసుకునే అవకాశాలు ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం మేకర్స్ ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఒకవేళ అన్నీ అనుకున్నట్లే జరిగితే.. దేవి శ్రీ ప్రసాద్ సరసన మమితా బైజు జోడీ కట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం మాత్రం 'ఎల్లమ్మ' హీరోయిన్ ఎవరు? అనే సస్పెన్స్ కొనసాగుతోంది.






EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com